FELLOWSHIP WITH GOD AND MAN

# పిలువ

ఆధ్యాత్మిక మాసపత్రిక



పిలచిన దేవుని పనిలో అవిశ్రాంతంగా పోరాడి,
నిత్య బహుమతికై ప్రభువు చెంత చేరినవారే
అందరిని మించిన శ్రేష్టులు, ధన్యజీవులు.

మార్చి 2008



సంపాదకీయం

# సదా జీవిస్తాం

క్రీస్తు పునరుద్ధానము మానవాళికి ఎనలేని నిరీక్షణ తెచ్చిపెట్టింది. క్రీస్తు పునరుద్ధానము మరణమును నిరర్థకము చేసింది. క్రీస్తును విశ్వసించిన ప్రజలు చావుకు వెరవవలసిన పనిలేదు. మరణము వలన కలిగే ఎడ బాటు దు:ఖ కరమే అయినా మరణము పిమ్మట క్రీస్తు బిడ్డలకు లభ్యమయ్యే మహిమను తలపోస్తే దు:ఖానికి రెక్కలు వచ్చి ఎగిరిపోయినట్లే. ఆ స్థానంలో సంతోషం ఆవరించి తీరుతుంది. క్రీస్తునందలి మరణము మహిమ ప్రవేశానికి మార్గం. అందుకే 'ప్రభువునందు మృతి నొందు మృతులు ధన్యులు'. అని వ్రాయబడింది. క్రీస్తు బిడ్డలకు మరణము భయంకరమైనదికాదు. క్రీస్తు ప్రభువు చేతిలో మరణం పరాజితమైంది గనుక క్రీస్తునందలి విశ్వాసముతో జీవించి ఆయన యందు మరణించిన వారు ఆయనతో కూడ లేచి ఆయనతో సదా జీవిస్తారు. మరణించిన వారిని, మరణించ బోవుచున్న వారిని మరణములో నుండి విముక్తులను చేయడానికి ప్రభువు మరణించి, మరణాన్ని ఓడించి లేచారు. కాబట్టి మరణము ద్వారా సంక్రమించిన విచారమును వీడి ప్రభువు పదజాడల్లో కార్యోన్ముఖులమై కొనసాగడం మన కర్తవ్యం.

మనకంటే ముందు మరణించిన వారు మనకు స్వాగతం పలకడానికి మృత్యుంజయుడైన యేసు వెంట రానైయున్నారనే వాక్యం మనకు ఎంతో తృప్తి నిస్తుంది. అంతేగాక ప్రభువుతో కూడ మనవారిని ఎదుర్కోవాలనే లేక కలుసుకోవాలనే తపనను పెంపొందింపచేస్తుంది. వారిని కలుసు కోవాలంటే ప్రభువు చిత్తాను సారంగా జీవించడం తప్పనిసరి. ఆయన చిత్తానుసారులు మాత్రము ఆయన చెంత చేరగలుగుతారు. ఆయనతో సదా జీవించగలుగుతారు.

క్రీస్తు సంబంధికులకు మరణం తాత్కాలిక ఎడబాటు. పునరుద్ధానంలో ఎడబాటుకు ఆస్కారం ఏ మాత్రం వుండదు " కాగా సదాకాలము మనము ప్రభువుతో వుందము" అనే వాక్యము నెరవేరుతుంది. ఎడబాటులేని మహిమాన్విత సామ్రాజ్యంలో మహిమరాజైన యేసయ్యతో కలసి సదా జీవిస్తాము. సర్వదా పాలిస్తాము.

క్రీస్తు పిలుపు మేర సమర్పణతో దైవ పనిలో ప్రవేశించి అవిరళమైన కృషి సల్పి లక్షలాది మందికి ఆశీర్వాదాలు పంచియిచ్చిన మన ప్రియతమ దైవ జనులు "డాక్టర్ డి.జి.యస్ దినకరన్' గారు మనకంటే ముందు 20-2-08న మహిమ ప్రవేశం గావించారు. ఆయన స్థానం ప్రపంచంలో ప్రత్యేకతను సంతరించుకుంది. దానిని ఎవరూ భర్తీచేయడం సులభం కాదు. కానీ మృత్యుంజయుడైన క్రీస్తు పునరుద్ధాన శక్తి అంతకంటే ప్రభావితంగా " పాల్ దినకరన్ మరియు వారి పిల్లలలో పనిచేయగలదని, సమాజంలో నాశనానికి జోగుచున్న ప్రజల రక్షణార్థమై వినియోగపడగలదని నా ప్రగాఢ నమ్మకం, ప్రార్థన.

నా కత్యంత ప్రియ దైవజనులు రెవ. గోడి సామ్యేలు గారి పెద్దకుమారుడు జాన్ యస్. గోడిగారు-ప్రమాదవశాత్తు ఈ లోక యాత్రముగించారు. కుటుంబ సభ్యులు క్షతగాత్రులయ్యారు. గోడిగారి కుటుంబం దు:ఖములో ఉంది. మరణించిన మన ప్రియులను మనం తిరిగి కలుసుకొనే రోజు అత్యంత సమీపంగా వుంది.

శ్రీమతి స్టెల్లా దినకరన్, పాల్ దినకరన్ వారి పిల్లలు మరియు 'జీసస్ కాల్స్' పరిచర్యలోని సభ్యులు, దైవజనులు గోడి సామ్యేలు గారి కుటుంబ సభ్యులు ప్రభువు వలన ఎనలేని ఆదరణ పొంది, దైవశక్తి చేత బలపర్చబడి క్రీస్తు పునరుద్ధాన శక్తిని మరింత బలంగా ప్రకటించే శక్తి సంపన్నులు కావాలని మా ఆకాంక్ష, ప్రార్థన. 'గాస్పెల్ ప్రెయర్ టెంపుల్ మినిస్ట్రీస్' లోని సభ్యులు, మా కుటుంబం, దైవాదరణ, పరిశుద్ధాత్మ శక్తి వీరిని ఆవరించాలని ప్రార్థిస్తున్నాం.

మరణానికి వెరువక సాగిపోదాం. మరణంలోనుండి జీవములోనికి అనేకలను దాటించడానికి మరణము వరకు నమ్మకంగా కృషి సల్పుదాం. మరణాన్ని జయించి లేద్దాం. సదా ప్రభువు చెంత జీవిద్దాం.

**- మీ సజ్జా**

సంపుటి - 9 సంచిక - 03

# విలువ

ఆధ్యాత్మిక మాసపత్రిక

మార్చి 2008

సంపాదకులు

రెవ. బర్నబాస్ సజ్జా

డి. వి. ప్రసాద్

సంవత్సర చందా
రూ. 100 /-

జీవిత సభ్యత్వం రూ. 1000 /- ఆపైన

మీ సభ్యత్వములు, కానుకలు, ప్రార్థనా అవసరతలు పంపవలసిన చిరునామా:

ఎడిటర్ - విలువ,
4 - 61 బి, పామర్రు రోడ్డు,
గుడివాడ - 521 301.
కృష్ణాజిల్లా, ఆం. ప్ర.
ఫోన్: 08674 - 242928
e - mail:
barnabassajja@hotmail.com

Edited, Printed, Published & Owned by
*Rev. Barnabas Sajja,*
D.No:4 - 61B, Pamarru Road, Gudiwada. Krishna Dt. Andhra Pradesh. Pin: 521 301.
Printed at *SAJJA GRAPHICS,* Gudiwada.
RNI. No: APTEL / 1999 / 757
(IR/GDV/VLV/05) 2006-08

## ఈ మాసం ...



ప్రేమ స్వభావం 2

దేవుని ప్రణాళికలో తలంపులు 5



మనస్సు కుదిరినందున... 8

నన్ను జ్ఞాపకం చేసు కొనమనెను 11





బైబిల్ ప్రవచన మందు 16

క్రీస్తు అనుకరణము .................... 14

పవిత్ర గ్రంథ పఠన ...................... 19

విధేయత ....................................21

రాజులు ..................................... 23

యాజమాని సంతోషం...............24



# ప్రేమ స్వభావం

- రెవ॥ బర్నబాస్ సజ్జా

(గత సంచిక తరువాయి)

ప్రియ 'విలువ' పాఠకులకు క్రీస్తు నందు శుభములు. గత మాసంలో 'ప్రేమ లేని వాడనైతే' అనే శీర్షిక ఈ పత్రిక ద్వారా 1 కొరింథీ 13:1-3 వచనముల ఆధారముతో మీముందు వుంచబడింది. ఈ మాసంలో తిరిగి అదే పత్రిక అదే అధ్యాయములోని 4 వచనము నుండి ప్రేమ యొక్క స్వభావాన్ని మీ ముందుంచాలని ప్రార్థనా పూర్వకంగా సంకల్పించాను. ప్రార్థనా పూర్వకంగా చదవండి, ధ్యానించండి. జీవిత విలువను పెంపొందింప చేసుకొండి.

గత సంచికలోని సందేశ ప్రకారం భాషలు మాట్లాడుట, కృపావరములు కలిగియుండుట, జ్ఞానమును ఎరిగియుండుట, విశ్వాసమును కలిగియుండుట, బీదలకు ఆస్థిని అప్పగించుట, కాల్చబడుటకు శరీరములను అప్పగించుట మున్నగునవి మాత్రమే ప్రేమ లక్షణములు కావని పై స్థితి అంతయు వ్యక్తి కలిగియున్నను అతనిలో ప్రేమ రాహిత్యము వుండవచ్చుననియు, తద్వారా అతని జీవితము వ్యర్థముగాను, నిష్ప్రయోజనకరంగాను మారే అవకాశమున్నదని గ్రహించాము. ఈ సంచికలో విశ్వాసము, నిరీక్షణల కంటే శ్రేష్టమైన ప్రేమ యొక్క స్వభావంలోని కొన్ని విషయాలను తలపోద్దాం.

## దీర్ఘకాలము సహించే ప్రేమ :

ప్రేమకు గల శ్రేష్ఠ లక్షణాలలో ఒకటి సహనశీలత. ప్రేమించే వ్యక్తి సహిస్తాడు. సహనాన్ని ఏ వ్యక్తైనా కోల్పోయాడంటే అతనిలోని ప్రేమ సన్నగిల్లిందన్నమాటే. ప్రేమ, సహనము రెండూ కలసి సహజీవనం చేస్తాయన్న మాట. ఈ సహజీవన పరిధి బహు విస్తృతం.వైవాహిక సంబంధంలో భార్య మరియు భర్త వారి జీవితాంతం కలసి జీవించవలసి వుంటుంది. వీరిలో ఎవరేని చనిపోతేనే తప్ప విడిపోవడం జరగదు. ప్రేమ అంతకు మించిన శ్రేష్ఠ లక్షణం.

భార్య లేకుండా భర్త, భర్త లేకుండా భార్య మనుగడ కొనసాగించగలరేమో గాని ప్రేమ లేకుండా సహనము, సహనము లేకుండా ప్రేమ జీవనం కొనసాగించలేవు. "ప్రేమ దీర్ఘకాలము సహించును" 'దీర్ఘకాలము' అనే దానికి అంతును (పరిధిని) నిర్ణయించడం కష్టం. కాని మనం ఈనాడు సహించే తత్వాన్ని కోల్పోయినట్లే కన్పిస్తూంది. అంటే ప్రేమను కోల్పోయామన్నమాటే.

ఒకరిని ఒకరు సహించక పోవడం ఒకరిని ఒకరు ప్రేమించక పోవడమే. సహనము వుంటే ప్రేమ వుంటుంది. ప్రేమ వుంటే సహనం వుంటుంది. ఇవి ఒక దానిని విడచి ఒకటి వుండలేనంత అవినాభావ సంబంధం గలవి. అక్రమము, అవిధేయత పెచ్చు పెరిగిన నేటి సమాజంలో ఇట్టి సహనము లేక ప్రేమ సాధ్యమా?

**పార్థనకు ప్రాధాన్యతను ఇస్తే ప్రతిఫలం పొందుతావు. పాపం కు ప్రాధన్యత ఇస్తే పతనం చేందుతావు.**

సహనము అనే పదము వెనుక నొప్పి, బాధ, శ్రమ, కష్టము, తిరుగుబాటు, మోసం, అవిధేయత, అతిక్రమము మున్నగు లక్షణాలున్నాయి. వీటన్నిటిని సహించేది ప్రేమ. మనం దీనికి ఖచ్చితంగా 'అసంభవం' అని అరచి మరీ చెప్తాం. మానవ సమాజంలో ఈవిధమైన సహనం సాధ్యమయ్యే పని కాదు. కానరాదు. అందుకే అడుగడుగునా ఘోరకృత్యాలు జరుగుచున్నాయి. నేటి గందర గోళపు వ్యవస్థకు కారణం సహనాన్ని అంటే ప్రేమను కోల్పోవడమేననే సంగతి వేరుగా చెప్ప నక్కరలేదు. ఎన్నో విషయాలలో మనం సహనం కోల్పోవలసి వస్తుంది. వీటికి కారణాలు ఎన్నెన్నో. అవి సహేతుకాలే కావచ్చు. కానీ ప్రేమించే వ్యక్తి సహనాన్ని కోల్పోవడానికి వీలులేదు. ప్రేమ ఎంతగా సహిస్తుందంటే తన ప్రాణమును అప్పగించేంతగా అన్నమాట. దీన్ని నిర్వచించడం కష్టతరమే అయినా కాస్త గ్రహించి తీరాలి.

రెండువేల సంవత్సరాల క్రిందట కల్వరి సిలువ సహనాన్ని వెల్లడి చేసింది. సృష్టికర్త మానవ రూపియై మన ఎడల చూపిన సహనము తేటతెల్లమయింది. సృష్టికర్త, జీవప్రదాతయైన దేవుని ఆజ్ఞలను మీరి మనిషి పాపిగామారాడు. పాపకృత్యాలు చేయడం ప్రారంభించాడు. స్వనీతి క్రియల మాటున పాపాన్ని దాచిపెట్టుకోవడానికి యత్నిస్తూ మరింత దుశ్చర్యలకు పాల్పడడం మొదలు పెట్టాడు. దేవునిలో గల ప్రేమ ఆయన సహనాన్ని అడుగడుగునా ప్రత్యక్షపరుస్తూ వచ్చింది. ద్రోహియై దారి తప్పిన మానవుని పట్ల దేవుడు వ్యక్తం చేసిన అవ్యాజ్యమైన ప్రేమ సిలువలో సుస్పష్టమైంది.

తొలి మానవుడైన ఆదాము అపవాది వలయంలో పడి అపరాధియైనపుడు దేవుడు సహనశీలియై ఆదాము హవ్వల దిగంబరత్వాన్ని కప్పాడు. స్నానం చేయించడానికి, బట్టలు తొడగడానికి తల్లికి సహనము అవసరం. తల్లి సహన గుణాన్ని మించింది దేవుని సహనము. ఆదాము దిగంబర దేహాన్ని కప్పడం ద్వారా తన సహనాన్ని (ప్రేమను) దేవుడు కనపర్చాడు. కేవలం అతని దిగంబర దేహాన్ని కప్పడం మాత్రమే గాక మనిషి నడవడికకు కావలసిన విధి విధానాలను రూపించి మనిషికి అప్పగించాడు దేవుడు. అయినా మనిషి దేవుని ఆజ్ఞలను, కట్టడలను మీరి యిష్టాను సారంగా వ్యవహరిస్తూ పోతూవుంటే తన ప్రతినిధులుగా ఎందరో ప్రవక్తలను, దైవజనులను ప్రజల చెంతకు పంపి వారిని సక్రమంగా తీర్చి దిద్దే ప్రయత్నం గావించాడు. ప్రజల తిరుగుబాటు తత్వం ఆయనకు ఎంతో బాధ, నొప్పి కలిగించింది. అయినా ఆయన ప్రేమ వల్ల ఆయన అన్నింటిని సహించాడు.

**ఆయన సింహాసనమును వీడి ప్రజలకు సేవ చేసే స్థితికి రావడానికి గల కారణము ఆయనలోని ప్రేమ. ఆ ప్రేమలోని సహనమే ఆయనను ఈ లోకంలోనికి, మన రక్షణార్థమై**

ఆయన సింహాసనమును వీడి ప్రజలకు సేవ చేసే స్థితికి రావడానికి గల కారణము ఆయనలోని ప్రేమ. ఆ ప్రేమలోని సహనమే ఆయనను ఈ లోకంలోనికి, మన రక్షణార్థమై రప్పించింది. ప్రభువు ఈలోకములోనికి దిగివచ్చి మన నిమిత్తమై ఎంతో సహించాడు. ఆయన తనకు కలిగిన అవమానాన్ని నిర్లక్ష్యపెట్టాడు, సిలువను సహించాడు. తనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమునంతయు ఓర్చుకున్నాడు. (హెబ్రీ 12:2,3). ప్రభువు సహనం ఆయనలోని దివ్య ప్రేమకు చిహ్నం. ఆయన సర్వాధికారి, సర్వశక్తి సంపన్నుడు, ఆయనలో సహనము

**ప్రార్థన పవిత్రతకు పునాది, పాపం పతనానికి నాంది.**

లేకపోతే లోకం ఏనాడో సంహరించబడి వుండేది. కానీ ఆయన సంహరించేవాడు కాడు సంరంక్షించేవాడు. సహనము సంహరించదు, సంరక్షిస్తుంది. సంహరించబడడానికైనా సిద్ధపడ్తుంది గాని సంహరించడానికి అంగీకరించదు. అందుకే తనను సంహరించబూని బంధించడానికి వచ్చిన వారిపై పేతురు కత్తి ఎత్తితే యిష్టపడలేదు ప్రభువు. భారమైన సిలువను వీపుపై మోపి సిలువలో వ్రేలాడదీస్తే, ఘోరాతి ఘోరంగా హింసిస్తే, "తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరెరుగరు క్షమించమంటూ (లూకా 23:34)వేడుకున్నాడే తప్ప దూషించలేదు. అతడు దౌర్జన్యము నొందెను. బాధింపబడినను అతడు నోరు తెరువలేదు (యెష 53:7)

క్రీస్తు సంఘాన్ని నిర్మూము చేయ సంకల్పించిన పౌలు పట్ల ప్రభువు కనపర్చిన సహనము పౌలును సద్భక్తునిగా, గొప్ప సేవకునిగా మార్చింది. నాపట్ల, మనందరిపట్ల మన ప్రభువు చూపుచున్న సహనమే మనం నేడు సజీవులంగా వుండడానికి హేతువు అనే విషయాన్ని విస్మరించవద్దు.

ప్రేమ దీర్ఘకాలము సహిస్తుంది. యేసయ్య మన విషయంలో తన ప్రాణాన్ని కోల్పోయేటంతగా సహించాడు. మనం మన ప్రాణాలను అప్పగించుటకైనను వెనుకాడనంత సహనము కలిగివుండాలని మనం దీనిని బట్టి గ్రహించాలి. ఇది ఆచరణకు అసాధ్యమని మనం భావించినా ప్రభువు నుండి నేర్చుకుని ఆచరించాలని పవిత్రవేదం మనకు ప్రబోధిస్తూంది. అట్టి సహనముతో కూడిన ప్రేమను మనం అలవర్చుకోకపోతే ఎన్ని యాగాలు చేసినా, త్యాగాలు చేసినా మనకు ప్రయోజనమేమీ వుండదు. అంతయూ వ్యర్థముగాను, ఒకడు గాలికి ప్రయాసపడినట్లుగాను వుంటుంది.

> సహనం కోల్పోయిన సామ్రాజ్యాలు మట్టి కరిసిపోయాయి. సహనంతో యేసు స్థాపించిన ఆయన ప్రేమ సామ్రాజ్యం నిరంతర విస్తరిస్తూనేవుంది

సహనం సత్ఫలితాలనిస్తుంది. అసహనంతో సాధించలేనిది సహనంతో సాధించగలుగుతాం. అయితే ఫలితమనేది ఆలస్యం కావచ్చు కానీ శాశ్వతం. వ్యవసాయదారుని సహనం పంట కూర్చుకోవడానికి ఎలా ఉపయోగపడ్తుందో అలాగే మన సహనం శ్రేష్ఠ ఫలసాయానికి, ఫల సమకూర్పుకు దోహదం చేస్తుంది. సహనం కోల్పోయిన సామ్రాజ్యాలు మట్టి కరిసిపోయాయి. సహనంతో యేసు స్థాపించిన ఆయన ప్రేమ సామ్రాజ్యం నిరంతరం విస్తరిస్తూనేవుంది. క్రీస్తు సహనం ప్రజలలోని కాఠిన్యాన్ని నిర్మూలింపచేసి వారి మార్పుకు దోహదం చేసింది.

మనం క్రీస్తు ప్రేమ సందేశానికి ప్రతీకలం, పత్రికలం. మనకు, క్రీస్తు సామ్రాజ్యానికి వ్యతిరేకంగా నేడు ఎన్నో కార్యాలు జరుగుచున్నాయి. క్రీస్తు ప్రేమను చాటించే మనలో నిజంగా ప్రేమ వుంటే సహనము కలిగి వ్యవహరిద్ధాం. సంఘు వ్యతిరేక శక్తులను మనలోని క్రీస్తు ప్రభుని ప్రేమ ద్వారా సంపాదించుకుందాం.

సహనం ఎంతకాలం? అనే ప్రశ్నకు జవాబు చెప్పాలంటే మన ప్రాణాలు పోయేంత వరకు అని చెప్పక తప్పదు. ఇది చాలా కష్టం. కానీ అసాధ్యం కాదు. ప్రభువును చాటించే వారందరికీ ఇది సాధ్యం కాక పోవచ్చు కానీ ప్రభువు ప్రేమను హృదిని కలిగియున్న వారికి ఇది సాధ్యమే .

**ప్రేమ దీర్ఘకాలం సహిస్తుంది.**

-- సశేషం

**పార్థన ద్వారానే పనులు సపలికృతం లేకుంటే విఫలం**

# దేవుని ప్రణాళికలలో తలంపులు



(గత సంచిక తరువాయి)

- రెవ॥ మేడూరి సామ్యూల్

***3. దేవుని తలంపులుఆశ్చర్యమైనవి (యెష 28:29) : -*** ''జనులు సైన్యముల కధిపతియగు యెహోవా చేత దాని నేర్చుకొందురు. ఆశ్చర్యకరమైన ఆలోచన శక్తియు అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే'' అంటున్నాడు ప్రవక్తయైన యెషయా.

మన పట్ల దేవునికున్న ఆలోచనలు ఆశ్చర్యకరమైనవి. శ్రేష్టమైన ఆలోచనలను బట్టి తన జ్ఞానము కొలది ప్రేమతో తన ప్రణాళికలను ఆయన మనకై రచించువాడు. కాబట్టియే అనేక మంది మనుషుల జీవితములు ఎన్నో మలుపులు తిరిగినప్పటికిని, యోగ్యమైన రీతిగా దేవుడు వారి జీవితములను తీర్చి దిద్దుతున్నాడు. యాకోబు ఒక మోసగాడు దానికి తోడు అతని పరిస్థితులు, సమాజము, కుటుంబము మోసగాని గానే ముద్ర వేసి, అతనిని రూపు దిద్దుతున్నప్పటికి, దేవుని ఆలోచన అతను ఒక ప్రజకు శ్రేష్టమైన తండ్రిగా నుండుట, దానినే ఆయన అతని జీవితంలో నెరవేర్చాడు. మోషే కోపదారి మరియు ఆవేశపరుడు, తన కోపం అణుచుకొనలేక పరిణామములు లెక్కించకుండనే ఒకని చంపి ఇసుకలో పూడ్చి పెట్టాడు. అయితే ఆతని పట్ల దేవుని ఆలోచన అతడు భూమి మీద సాత్వికుడైన మనుష్యుడుగా నుండవలెననునదియే. పేతురు దుడుకు జాలరి అయితే అతడు భూమిని తలక్రిందులు చేసే మనుష్యునిగా నుండ వలెననేది ప్రభువు యొక్క ఆశ్చర్యమైన ఆలోచన.

మనుష్యుల ఆలోచనలకు దేవుని ఆలోచనలకు మధ్య ఎంతో వ్యత్యాసముంది. అందునిమిత్తమే వాక్యము '' ఆయన తలంపులు తెలిసికొనకున్నారు, ఆయన ఆలోచన వారు గ్రహింపకున్నారు'' అని పలుకుచున్నది (మీకా 4:12)

***4. దేవుని తలంపులు గొప్పవి, ఉన్నతమైనవి మరియు విస్తారమైనవి :-*** (కీర్తన 139:17). దేవుని తలంపులు గొప్పవి మరియు ఉన్నతమైనవి. యిర్మీయా ప్రవక్త దేవుని స్తుతించుచున్నట్లుగా ''దేవుడు ఆలోచన విషయములో గొప్పవాడు, క్రియలు జరిగించు విషయములో శక్తి సంపన్నుడు'' (యిర్మీయా 32:19). ఆలోచన కర్తయగు దేవుని ఆలోచనలు ఎంతో గొప్పవిగా నుంటాయి. అవి మన తలంపులకు అందనివిగా నుండుటయే గాక ఎంతో ఆదర్శమైనవియనికూడా భావించదగును. ఎంతో గొప్ప దేవుడు తన ఆలోచనలో కొంత చెప్పినా మానవుడు అర్థం చేసికొనలేక అయోమయము చెందుటకు కారణం ఆయన

**కరణకు, కత్తికి పొత్తుకుదరదు**

తలంపులు బహు ఉన్నతమైనవి అగుటయే. ఒక్క(బిడ్డ) కలిగితే చాలు అని పరితపించుచున్న ఒక సామాన్య తండ్రికి దేవుడు భూమి మీదనుండు ఇసుక రేణువులంత గొప్పగా, ఆకాశ నక్షత్రములంత ఉన్నతంగా నీ సంతానముండును అని తెలిపితే ఎంత వరకు ఆ మనుష్యుడు అర్థం చేసికొనగలుగుతాడు? తనకై అడుగు స్థలములేని సంచారిని పిలిచి " నీవు లేచి యీ దేశము యొక్క పొడగున, వెడల్పున దానిలో సంచరించుము. అది నీకిచ్చెదనని " ఇంత ఉన్నత దేవుడు మాత్రమే పలుకగలడు గానీ ఇతరులకు అది సాధ్యంకాదు.

భూమి మీదనుండు ఇసుక రేణవులు మరియు ఆకాశ నక్షత్రములను లెక్కించుట ఎంత అసాధ్యమో దేవుని తలంపులు లెక్కించుట కూడ అంత అసాధ్యము. అందుకే కీర్తనాకారుడు " దేవా, నీ తలంపులు నాకెంత ప్రియమైనవి వాటి మొత్తమెంత గొప్పది. వాటిని లెక్కించెదననుకొంటినా అవి యిసుక కంటెను లెక్కకు ఎక్కువై యున్నవి" అంటున్నాడు (కీర్తన 139:17) ఎంత గొప్ప సత్యము ఇది. కీర్తనాకారుడు తన పట్ల దేవుని తలంపులను ఆలోచనచేయునప్పుడు విస్తారమైన ఆయన తలంపులనుబట్టి ఆశ్చర్యపడుచున్నాడు. దేవుడు తల్లి గర్భమందు తన రూపు దిద్దు కొనుచున్నది మొదలుకొని ఆయన శ్రేష్ఠ ఆలోచనల కొలది ఆశ్చర్యకరముగా తన్ను రూపొందించినట్లుగా తెలియజేయుచున్నాడు. దేవుడు మనుష్యుని నిర్మాణమును పర్యవేక్షించుచున్నాడు వాని ఎముకల నిర్మాణమును లెక్కించుచున్నాడు. అంటే శరీరరీతిని ఒక బలహీనుడైన మనుష్యుడు కూడా దేవుడు నన్ను పట్టించకొనలేదు లేదా లెక్కించుట లేదు అని తలంచ పని లేదు. ఎందుకంటే తను అర్థం చేసుకొన లేక పోయినప్పటికి కొన్ని శ్రేష్ఠమైన తలంపులు దేవుడు ఒక నిస్సహాయుడై మంచమునకు అంటుకొని పోయిన మనుష్యుని గూర్చి కలిగియున్నాడు. వాటి నెరుగ గలిగినప్పుడు అతడు అనేకలకుపయోగకరమైన మనిషిగా మారగలుగుతాడు. పెదవులు మాత్రము కదిలించ గలిగి చక్రాల కుర్చీకే అంటుకొని పోయి జీవనము చేసిన మేరీ జోన్స్ తన పట్ల దేవుని ప్రణాళికను, ఆయన ఉద్ధేశములను ఎరుగుట బట్టి తను కదలలేక పోయినా, తన పరిచర్యలతో ప్రపంచమును కదలించినది.

> భూమి మీద నుండు ఇసుక రేణువులు మరియు ఆకాశ నక్షత్రములు లెక్కించుట ఎంత అసాధ్యమో దేవుని తలంపులు లెక్కించుట కూడా అంత అసాధ్యము.

ప్రియులారా! దేవుడు మన శరీర నిర్మాణమును, అవయవముల పొందికను, ఎముకల అమరికను, జీవనమును మాత్రమే కాదు. నీవు కూర్చోవడం, లేవడం, నడక, పడక పనులు, తలంపులు అన్నింటిని ఎరిగి నీ పట్ల శ్రేష్ఠమైన తలంపులు కలిగియున్నాడు. నీవు గ్రహించలేక పోయినప్పటికి ఆయన నీపై ఎంత శ్రద్ధ కలిగియున్నాడు, ఎంత నీ గురించి తలంచుచున్నాడో తెలుసా ఆయన నీ తలవెంట్రుకలను గూర్చి కూడా శ్రద్ధ కలిగియున్నాడు.

**దేవుని బహుమానం మనిషి అవమానాన్ని తొలగిస్తుంది.**

***5. దేవుని తలంపులు స్వేచ్ఛాను సారమైనవి (దాని 4:35) :-*** దేవుని తలంపులు అద్భుతమైనవేగాక, దేవుని తలంపులు ఆయన ఇష్టానుసారమైనవి. మన గురించి మనము తలంచినట్లుగానే దేవుడు కూడా మనలను గురించి తలంచవలెననునది సరియైనదికాదు. దేవుడు శక్తిమంతుడు జ్ఞానవంతుడే కాదు ఆయన సర్వస్వేచ్ఛ గలవాడు కూడ. దేవుడు తన ఆలోచనల ప్రకారముగా మానవుల కొరకైన తన ప్రణాళికలను రచించి, ఆ ప్రకారముగా చేయగలవాడైయున్నాడు. ప్రపంచమును పరిపాలించిన బబులోనురాజు నెబుకద్నెజరును ప్రపంచ అధిపతిగా చేసి సమస్తజనమును అతని స్వాధీనము చేశాడు. అదేరీతిని ఆతని గర్వమును అణచ నుద్దేశించినప్పుడు, రాజ్యమును అతని నుండి తీసి వేయుటయేగాక, మనుష్యుల చేత కూడ తరుమ బడు స్థితికి అనగా మృగము, పక్షిరాజుల రూపము వంటి స్థితికి దిగజారునట్లు తృణీకరించాడు. అందుకే అతడు " అయన చేయి పట్టుకొని నీవేమి చేయుచున్నావని ఆయనతో చెప్పుటకు ఎవడును సమర్థుడుకాడు" అని పలుకుచున్నాడు (దాని 4:35).

> అయన ప్రణాళికలు గొప్పవి, అవి స్వేచ్ఛానుసారమైనవైయున్నవి

ఒక మనుష్యుడు తనను గూర్చి దేవునితో నాపట్ల నీవు ఇలా ఉద్దేశించవేమిటి? అని పలుకజాలడు. దేవుడు తన స్వేచ్ఛను, సార్వభౌమత్వమును సర్వజనుల పట్ల తన శ్రేష్ట ఉద్దేశాలను నెరవేర్చుటకే ఉపయోగించును. మనుష్యులకు, పక్షులకు, జంతువులకు ఎవరికి తగిన శరీరమును, వారికి అద్భుతముగా రూపించి ఇచ్చిన దేవుడు, వారి కొరకైన అద్భుత జీవితములను మాత్రము ఉద్దేశించడా? మనలో లేదా మన జీవితాలలో మన కయిష్టమైన దానిని బట్టి, మనలోటు పాటులను బట్టి చింత పడుతూ దేవుని ఉద్దేశములను తృణీకరించుచున్నామా? జీవితాలలోనికి వచ్చే కొద్ది కష్టాలు కొద్ది అసౌకర్యాలను బట్టి కూడా చాలా చింత పడుతూ దేవుని ఉద్దేశాలను ప్రశ్నించే ఎందరినో మనం ప్రతిదినం చూస్తూ ఉంటాం. మనము కూడా ఆలాగున దేవుని ఉద్దేశాలను ప్రశ్నిస్తూ ఉంటాం. అయితే దేవుని వాక్యము మన ఇబ్బందులు, సమస్యలలో కూడా ఆయన ఉద్దేశాలు ప్రశ్నించ సరికాదు అని నీ తలంపుల కందని ఆలోచనలు దేవునికున్నాయని వాటిని నీవు ఎరుగలేనప్పుడు దేవుని చేతికే అప్పగించి దేవునికి ఎదురు చెప్పుటకు నీ వెవడవు? నన్నెందుకీలాగు చేసితివని రూపించబడినది రూపించిన వానితో చెప్పునా? (రోమా 9:22)

దేవుడు తన ఇష్టాను సారముగా చేసినను ఆయన తలంపులు, శ్రేష్టతను బట్టి ఆయన నీతి గుణమును బట్టి ఆయన ప్రణాళికలు గొప్పవి, అవి స్వేచ్ఛానుసారమైనవైయున్నవి. దేవుని ఉద్దేశములు ఆశ్చర్యకరమైనవి, గొప్పవి, మరియు ఆయన ఇష్టానుసారమైనవని తలంచుటను బట్టి మన హృదయములు కృతజ్ఞతతో నిండవలయును. ఆయన తలంపుల కనుగుణముగా జీవించవలయును.

-- సశేషం

**మానవ జ్ఞానం పాపంకు రంగులు పులుముతుంది కాని దేవుని జ్ఞానం పాపం నుండి రక్షిస్తుంది.**

వనితాలోకం



# మనస్సు కుదిరినందున....

**దేహ ప్రాణాత్మల కలయిక జీవించే ప్రాణి. మనిషి లేచినది మొదలు నిద్రకుపక్రమించు వరకు చేసే పనులు అనేకం, కొన్ని రొటీన్‌గా చేసే పనులు. మరి కొన్ని మనసు లేకుండానే బలవంతంగా చేసేపనులు బహు కొద్ది మాత్రమే-మనస్ఫూర్తిగా, విశాల దృక్పథంతో ఇబ్బందయినా సంతోషంగా చేస్తుంటారు.**

-- జీవన్‌రాణి. సజ్జా

మన యింటికి అతిథులొచ్చినప్పుడు అంతేగాక ఆయా విందు కార్యక్రమాల్లో మన ప్రేమను, మర్యాదను వ్యక్తపరుస్తూ వద్దన్నా కొసరి కొసరి వడ్డిస్తుంటాం. అంతమాత్రమే గాక వెళ్తున్న అతిథులకు మన స్టేటస్‌కు తగ్గట్లుగా ఆయా గిఫ్ట్, స్వీట్స్, హాట్, ఫ్రూట్స్ ఏవేవో యిచ్చి పంపించడం ఆనవాయితీ అయిపోయిందీ నవ నాగరిక సమాజంలో. మరో విధానం బఫే సిస్టమ్. మన కిష్టమైనవి తినొచ్చు లేకపోతే లేదు. ఇదంతా మన యిష్టంమీద ఆధారపడుంది. మనస్సుంటే అన్నీ తినొచ్చు, ఎంతైనా తినొచ్చు. వద్దనుకుంటే ఒకటి రెండు టేస్ట్ చేసి వదిలెయ్యొచ్చు. ఈ బఫే విధానాన్ని సిటీ వారు తప్ప మిగిలినవారు అంతగా శ్లాఘించరు. విసుకుచెందేవారు ఎక్కువ మంది. వడ్డన విధానము, బఫే విధానము ఈ రెంటికి దైవ విధానంలో ప్రాశ్యస్తత చూడగలం.

మన అవసరతలకు కావలసిన సౌకర్యాలు, మనం చేయవలసిన కర్తవ్యాలు అన్నీ బఫే సిస్టంలా మనముందు పరచబడ్డాయి. దేవుని ద్వారా పొందుకోగలిగిన వన్నీ మన అవసరతలు తీర్చబడటానికి మన సొంతం చేసికొంటున్నాం. భుజిస్తున్నాం. నొక్కి చెప్పాలంటే మ్రింగేస్తున్నాం. మన ముందు పరచియుంచిన పనులను చేయుటకు కూడ బఫే విధానాన్నే భగవంతుడు మనముందుంచాడు. అనుభవించడానికున్నంత ఆశ, ఆతురత పని చేయడంలో కనిపించడంలేదు. టేస్ట్ చేసి వదిలేస్తున్నట్లు అనేకుల పని తీరుంటుంది. గతంలో కష్టమైనా విసుగులేకుండా యితరుల అవసరతలలో పాలుపొందేవారు. ఈ దినాల్లో మా అవసరతలే తీరడం లేదు యిక ఎదుటివారి అవసరతలు తీర్చడమా అన్నట్లుంది ప్రతివారి ధోరణి.

బెత్లెహేములో కరువు భారమధికంగా వుండగా, నమోమి, ఆమె భర్త యిరువురు

కుమారులు మోయాబు ప్రాంతానికి వెళ్లారు. అక్కడే పిల్లల పెళ్ళిళ్ళు చేయడం అక్కడే కుటుంబానికి చెందిన ముగ్గురు మగవారు కాలం చేయడం కూడ జరిగింది. తిరిగి బెత్లెహేములోని సమృద్ధిని గూర్చి విన్న నయోమి తన ప్రాంతానికి బయలుదేరుతుంది. కోడండ్రు రూతు, ఓర్పాలు కూడ ఆమెతో కలిసి బయలు దేరుతారు. కాని నయోమి తన నిస్సహాయతను వ్యక్తం చేస్తూ, కోడండ్రను వారి దేశంలోనే అగిపోయి పెండ్లి చేసికోమని నివారిస్తుంది. ఓర్పా ఆగిపోయింది. కాని రూతు నా వెంబడి రావద్దని నీవనవద్దు, నీ దేవుడే నా దేవుడు నీ జనమే నా జనము మరణము తప్ప నిన్ను నన్ను ఏది వేరుచేయలేదు అని చాల గట్టిగా తన నిర్ణయాన్ని వ్యక్తపరస్తుంది. రూతు 1:18లో "తనతో కూడ వచ్చుటకు ఆమె మనస్సు కుదిరినదని నయోమి తెలిసికొనినపుడు అందునుగూర్చి ఆమెతో మాటలాడుట మానెను". రూతునకు నయోమితో వెళ్ళడానికి మనస్సు కుదిరింది. వెళ్ళడం ద్వారా రూతునకు వచ్చే ప్రయోజనమేమి లేదు. వృద్ధురాలైన అత్త ఈమె పోషణకు ఏ విధమైన ఏర్పాట్లు చేయలేదు. ఈమెను సంరక్షించడం తన వల్లకాని పని శపిత జనాంగమైన మోయాబీయురాలిని యూదా ప్రాంతమందెవరూ పెండ్లి చేసికోరు. ఆలోచిస్తే పరిస్థితులన్నీ రూతుకు ప్రతికూలతలే తప్ప అనుకూలతలు ఏ ఒక్కటి లేదు. అయినా ఒంటరిగా ఉన్న అత్తను, ఆమె అవసరతను గుర్తించి రూతు ఆమె సహాయార్థమై ప్రతికూలతల వైపు చూడకుండా ఆమెతో కలసి బయలుదేరింది. తన అత్త సహాయార్థమై అత్తతో వెళ్ళడానికి ఆమె మనస్సు కుదిరినది. మనసు కుదిరితేనే యితరుల అవసరతలో పాలుపొందగలం. మనస్సు కుదిరితేనే చేయవలసిన పనిలోని ప్రతికూలతలను స్వాగతించగలం. ప్రతికూలతలలో నహితం ప్రశాంతతను అనుభవించగలం.

> ప్రభువు పని కొరకు, ప్రజల క్షేమం కొరకు మనస్పూర్తిగా చేసే పనిని దేవుడు ఆమోదించి ప్రతిఫలంగా అనేక దీవెనలిస్తాడు.

మనం చేయవలసిన పనులు మనముందు పరచబడియున్నాయి. మన అవసరతలు తీరుస్తున్న ప్రభువు మనపై బానిసతత్వాన్ని, నిరంకుశత్వాన్ని వినియోగించి పనిచేయించుకోవడం లేదు. బఫే విధానంలో మన ముందుంచబడిన పనులు చేయడంలో మన మనస్సు కదలాలి. ప్రభువు పని కొరకు, ప్రజల క్షేమం కొరకు మనస్పూర్తిగా చేసే పనిని దేవుడు ఆమోదించి ప్రతిఫలంగా అనేక దీవెనలిస్తాడు. రూతు జీవితాన్నే పరిశీలిద్దాం. మనసు నిలిపి, నడుం కట్టి, ప్రతికూలతలను ప్రక్కన బెట్టి నయోమి కొరకు రూతు చేసినదంతయు చాల ఆస్థిపరుడైన బోయజునకు తెలియబడింది. రూతుపై కటాక్షముతో బోయజు అంటున్నాడు- " యెహోవా నీవు చేసిన దానికి ప్రతిఫలమిచ్చును, ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా నుండునట్లు నీవు వచ్చితివి, ఆయన నీకు సంపూర్ణమైన బహుమానమిచ్చును". రూతు 2:12. బఫే విధానంలో మంచి

**క్రైస్తవునికి మృత్యువు పరలోకం ఉదయించడానికి ముందు గడిచిపోయే చీకటి**

మనస్సుతో మనం ఎన్నుకునే, చేసే పనులకు నిశ్చయంగా ప్రభువు ప్రతిఫలమిస్తాడు. సురక్షితముగా నుంచుతాడు. సంపూర్ణబహుమానమిస్తాడు. దీనిలో ఏ సందేహం లేదు. అందుకే నిరుపేద, నిస్సహాయురాలు, నిరాకరింపడిన, శపింపబడిన స్త్రీ మనస్ఫూర్తిగా చేసిన మంచి పనికి ప్రతిఫలంగా నిరుపేద, సంపన్నురాలైంది. నిస్సహాయురాలు గొప్ప సహాయాన్ని పొందుకుంది. నిరాకరింపబడిన స్త్రీ అంగీకరించబడింది. శపింపబడిన జనాంగంలో నుండి ఆశీర్వదించబడిన జనాంగంలోనికి మార్చబడింది. యేసు క్రీస్తు వంశావళిలో చేర్చబడింది. దీనికి కారణం బోయజు రూతును వివాహమాడటమే.

మనముందుంచిన పనులను మనమెంచు కొనే విధానం ప్రభువుకు ఆమోదయోగ్యమైతే తిరిగి ప్రతిఫలంగా ఆయన మనకిచ్చే ఆశీర్వాదాల వడ్డ కొసరి కొసరి ప్రేమంతా ఒలకపోస్తూ చేసే వడ్డన మాత్ర కాదు. విందులో సంపన్నులు తమ స్థాయికి తగిన గిఫ్ట్ ఎలా యిస్తున్నారో, అంతకంటె మిక్కిలిగా సకలాశీర్వాద కారకుడు, సకలైశ్వర్య సంపన్నుడు తన స్థాయికి తగిన రీతిలో మనకు గిఫ్ట్ యిస్తున్నాడు. భౌతికంగా ఒక పనికి అభినందన, ప్రతిఫలం ఒకసారి మాత్రమే లభిస్తుంది. కాని మంచి మనస్సుతో చేసే పనికి దైవికంగా పొందుకొనే ప్రతిఫలం జీవిత కాలమంతా కొనసాగుతుంది.

> యేసు సిలువ శ్రమలను ధ్యానిస్తున్న మనం ప్రభువు అప్పగించిన పనిని ప్రభువు మనస్సుతో చేద్దాం. ప్రభువిచ్చే దీవెనను అందుకుందాం

*రోమా 8:32 " తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుక తీయక మన అందరికొరకు ఆయనను (యేసుకు) అప్పగించినవాడు ఆయనతో పాటు సమస్తమును మనకెందుకు అనుగ్రహింపడు?* "మానవుల రక్షణ, విడుదల కొరకై తండ్రియైన ప్రభువువాక్కు కుమారుని రూపంలో ఈ లోకానికొచ్చి సిలువపై మరణించాడు. తన సొంత కుమారుని లోక కళ్యాణార్థమై అప్పగించిన ప్రభువు మన కొరకు నిశ్చయంగా, నిస్సందేహంగా మన సమస్త అవసరతలు తీరుస్తాడు, తీర్చగలడు. యేసు సిలువ శ్రమలను ధ్యానిస్తున్న మనం ప్రభువు అప్పగించిన పనిని ప్రభువు మనస్సుతో చేద్దాం. ప్రభువిచ్చే దీవెనను అందుకుందాం.

*ఫిలిప్పీ 2:4,5 " మీలో ప్రతివాడును తన సొంత కార్యములను మాత్రమేగాక యితరుల కార్యములను కూడ చూడవలెను. క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి".* యేసు దేవుని స్వరూపాన్ని, మహిమలోకాన్ని మనకొరకై విడిచి పెట్టాడు. మన స్వార్థం, మన కార్యాలంటూ మన మనస్సుతో కాక ప్రజల క్షేమం కొరకు, ప్రభువు మహిమ కొరకు ప్రభువు మనస్సుతో పనిచేద్దాం.

**ప్రార్థించుటకు మాత్రమే కాక పరిచర్య చేయుటకు కూడా మోకాళ్లూను!**

# నన్ను జ్ఞాపకము చేసుకొనమనెను



-- అవ్వారి శ్రీనివాసరావు

క్రీస్తు నందు ప్రియులైన దేవుని ప్రజలారా, ఈ లోకంలో మనం జీవిస్తున్నాం మనకు ఏదైనా అవసరం వస్తే ఇతరుల మీద ఆధారపడుతాం, వారి యొద్దనుండి సహాయం కోరుకుంటాం, మంచిదే. ప్రస్తుత ప్రపంచంలో కొంతమంది వారి తెలివి మీద, జ్ఞానం మీద, శక్తి సంపదల మీద ఆధారపడుతూ విర్ర వీగుచున్నారు, మరి కొంత మంది ఇతరుల యొక్క అండదండల మీద ఆధారపడి జీవించాలని కోరుకుంటున్నారు. ఒకటి మరచిపోతున్నారు. సకల చరాచర సృష్టికి ఆధారభూతుడు మరియు శ్రీమంతుడైన ఆ భగవంతుని మీద ఆధారపడి జీవించాలనుకున్న వారు చాలా కొద్దిమంది కనబడుచున్నారు. క్రీస్తునందు దేవుని పిల్లలారా మరి ఈ వ్యక్తి నన్ను జ్ఞాపకము చేసికొనుమని ఎవరిని అడిగాడో చూద్దాం......

“ ఆయనను చూచి- యేసూ, నీవు నీ రాజ్యము లోనికి వచ్చునపుడు నన్ను జ్ఞాపకము చేసికొనమనెను”(లూకా 23:42). మన కోసం ఈ లోకానికరుదెంచిన ఆ పరమాత్ముణ్ణి శిలువ వేసి చంపారు. ఆయన శిలువలో వ్రేలాడుతున్నపుడు తనతో పాటు ఇరువైపులా ఇద్దరు నేరస్థులు కూడా శిలువలో వ్రేలాడుతున్నారు. ఒక నేరస్థుడు మాత్రం ఆ పరమాత్ముడైన యేసును దూషించి, ఎగతాళిగా మాట్లాడాడు కానీ మరొక నేరస్థుడు మాత్రం అతనికి భిన్నంగా మాట్లాడి దేవుని కృపకు పాత్రుడయ్యాడు. ఎలా తను దేవుని కృపకు పాత్రుడయ్యాడు అనేది ఒకింత దేవుని వాక్యపు వెలుగులో నుంచి ఆలోచిద్దాం. నేను దేవుని వాక్యాన్ని ధ్యానం చేస్తూ ఉన్నప్పుడు ఆ నేరస్తునిలో మూడు అద్భుతమైన విషయాలు నాకు కనిపించాయి.

***1. తన స్థితిని తాను గుర్తించాడు:-*** “ మనకైతే ఇది న్యాయమే.... ” (లూకా 23:41) అని పలికాడు. ఈ నేరస్థుడు ఉదయము నుండి ఆ యేసుతో సహవాసం చేస్తున్నాడు ఆయనతో వారిరువురుకూడా వారివారి శిలువను మోసుకొచ్చారు. ఆ యేసును రోమా సైన్యము అతిదారుణంగా హింసిస్తున్నారు, అతి కిరాతకంగా కొడుతున్నారు కాని ప్రభువైన యేసు నోరు విప్పి ఎవరినీ కూడా దూషించలేదు. ఆ దివ్యమూర్తిని చూస్తున్న ఈ నేరస్థుడు యేసు యొక్క ప్రేమను, అదేవిధంగా ఆయన పలికిన మాటను విన్నాడు. “ తండ్రీ వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించమని” అన్నమాటలు విన్నాడు. ఆయనే నిజమైన దేవుడు అని గుర్తించాడు. అయితే ఆ నేరస్థుడు చేసిన తప్పిదము ఏమిటో తనకు స్పష్టంగా తెలుసు, కాబట్టి తన తప్పిదాన్ని దేవుని యందు ఒప్పుకున్నాడు. తాను చేసిన పాపానికి తాను అనుభవించుశిక్ష న్యాయమే అని తెలుసుకోగలిగాడు. క్రీస్తునందు, ప్రియులారా దేవుడు మనలను

**ఉన్నతమైనదంతయు పవిత్రమైనది కాదు**

జ్ఞాపకం చేసుకోవాలంటే మొదట మన స్థితిని దేవుని ఎదుట ఒప్పుకోవాలి. అతి క్రమములను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును" (సామెతలు 28:13) అని దేవుని వాక్యం చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. దేవుడు మనలను జ్ఞాపకం చేసుకోవాలని అందరం ఆశిస్తాం అయితే మనలో ఉన్న లోపాన్ని పాపాన్ని అవిధేయతను నిజముగా గుర్తించి ఆయన ఎదుట ఒప్పుకున్నట్లైతే ఆ నేరస్థుని జ్ఞాపకం చేసుకున్న దేవుడు మనలను కూడా జ్ఞాపకం చేసుకుంటారు. " మోసపోకుడి, దేవుడు వెక్కిరించబడడు, మనుష్యుడు ఏమివిత్తునో ఆ పంటనే కోయును" (గలతీ 6:7) అని లేఖనములు చెపుతున్నాయి. మనలోవున్న పాపాన్ని  లేదా తప్పును ఎవరిదగ్గరైనా దాచిపెట్టవచ్చుకానీ దేవుని ఎదుట దాచలేము. ఆయన కనుదృష్టికి మరుగైనది ఏదీలేదు.

కాబట్టి ప్రియసోదరీ, సోదరుడా దేవుడు నీ ప్రస్తుత స్థితిని జ్ఞాపకం చేసుకుని నీ దుర్భర స్థితి నుంచి విడిపించాలంటే నీలో ఉన్న లోపాన్ని ఒప్పుకో ఆయన కనికరమును పొందుకుంటావు.

**2. క్రీస్తును మహిమ పరిచాడు:** "..... మనము చేసిన వాటికి తగిన ఫలము పొందుచున్నాము గాని యియన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి" (లూకా 23:41) ఆ నేరస్థుడు పలకగలిగాడు. క్రీస్తుతో పాటు తన సిలువను మోస్తున్న ఆ నేరస్థుడు సుమారుగా ఆయనతో ఆరు గంటలు సహవాసం చేసాడు. ఆయనను రోమా సైనికులు నరరూప రాక్షసుల్లాగ హింసిస్తున్నా పల్లెత్తి మాట పలుకలేదు. అంతమాత్రమే కాక ఆయన వారిని క్షమించమని పలికిన మాటలు ఆ నేరస్థుని హృదయములో చెరగని ముద్రగా నిలిచిపోయాయి. అంతే ఆ ప్రేమ మూర్తియైన యేసే నిజమైన దేవుడు అని గుర్తించాడు. తన హృదయంలో నమ్మాడు. దేవుడు మనలను జ్ఞాపకం చేసుకొని మనలను మన శ్రమలనుండి లేదా బాధల నుండి విడిపించాలంటే ఆయన ఎవరో గుర్తించాలి. ఆయన ప్రేమను మనం తెలుసుకోవాలి, ఆయనే రక్షించగల సమర్థుడు అని మనం నమ్మాలి. ప్రియమైన సోదరీ, సోదరుడా నమ్ముట నీవలనైతే, నమ్మువానికి సమస్తము సాధ్యము అని ప్రభువు సెలవిచ్చాడు. కాబట్టి నిన్ను విడిపించే శక్తి ఆయనలో ఉందని నీవు గుర్తించాలి. చాలామంది ఆయన చేస్తారో, చేయరో అన్న అపనమ్మకం వారికి ఉంటుంది. కానీ ఈ నేరస్థునికి అలాంటి అపనమ్మకం ఏమాత్రమూ లేదు. అంతేకాక ఆయనలో ఏ తప్పిదమును లేదని పలికాడు. అనగా ఆయన పరిశుద్ధుడు, నిర్దోషి అంతేకాక పాపులలో చేరక ప్రత్యేకించబడిన వ్యక్తి అన్న మాటలు తన నోటిద్వారా ఒప్పుకున్నాడు. ఈ నేరస్థుడు క్రీస్తుని అద్భుతంగా మహిమపరచాడు అందుకే ఆయనను దేవుడు జ్ఞాపకం చేసుకున్నాడు. ప్రస్తుతం క్రైస్తవ పరిస్థితి చాలా దయనీయంగా తయారయింది. ముఖస్తుతి, మనుషులను  పొగడడం,

> దేవుడు మనలను జ్ఞాపకం చేసుకొని మనలను మన శ్రమలనుండి లేదా బాధల నుండి విడిపించాలంటే ఆయన ఎవరో గుర్తించాలి. ఆయన ప్రేమను మనం తెలుసుకోవాలి.

వారి మన్ననలను పొందుకోవాలని తహతహలాడుతున్నారు. మనచుట్టూ వున్న వారిని గౌరవించాలి మరియు అభినందించాలి అది వాస్తవం. కానీ మనం వారిని గౌరవిస్తే, వారిని పొగిడితే వారు మనలను జ్ఞాపకం చేసుకుంటారు కాబట్టి ఎలాగొలా బ్రతికిపోవచ్చు అనుకొనేవారు ఎక్కువైపోయారు. క్రీస్తునందు ప్రియమైన సోదరీ, సోదరుడా ముఖస్తుతికోసం మనుష్యుని పొగడకు. మానవ మాత్రుడు బుడగవంటివాడు. కానీ పరమాత్ముడు నిత్యుడు, ఆ నిత్యుడైన దేవుణ్ణి నీవు స్తుతించటం నేర్చుకుంటే ఆయన నిన్ను తప్పక జ్ఞాపకం చేసుకుంటాడు. దేవునికి చెందవలసిన మహిమను మనిషికి ఆపాదించి ఘోరమైన పాపానికి ఒడికట్టే స్థితిలో నీవు దయచేసి ఉండకు. దావీదు గొఱ్ఱెలు కాపరిగా ఉన్నప్పుడు దేవుని స్థుతించగలిగాడు కాబట్టే దేవుడు తనను జ్ఞాపకం చేసుకొని, తన అభిషేకమును ఉంచాడు. దావీదు దేవుని తన గానాలాపనతో హృదయ పూర్వకంగా స్తుతించాడు, మహిమ పరచాడు అందుకే గాఢాంధ కారపులోయలో నేను సంచరించినను ఏ అపాయము నా దరికి చేరదు అని అనుభవించి చెప్పాడు. ప్రియమైన దేవుని ప్రజలారా మనము క్రీస్తును మహిమపరచడం నేర్చుకుంటే ఆయన తప్పక మనలను జ్ఞాపకం చేసుకుంటాడు.

మనం క్రీస్తును మహిమపరచడం నేర్చుకుంటే ఆయన తప్పక మనలను జ్ఞాపకం చేసుకుంటాడు.

**3. క్రీస్తే ఈ విశ్వానికి రారాజు అని గుర్తించాడు:-**

"....యేసూ, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు జ్ఞాపకం చేసుకోమనెను" (లూకా 23:42) అని ఆనేరస్థుడు క్రీస్తును వేడుకున్నాడు. అంటే ఆయన తన రాజ్యముతో ఒకానొక దినమున ఈ లోకానికి రాబోతున్నాడన్న ప్రగాఢమైన నమ్మికను కలిగియున్నాడు. ప్రభువు మనలను జ్ఞాపకం చేసుకోవాలంటే ఆయన రాజు అని మనం నమ్మాలి. ఈ లోకానికి రెండవసారి రాబోతున్నాడని మనం విశ్వసించాలి. నమ్మితే నీవు జ్ఞాపకం చేసుకోబడతావు. "యేసు ప్రభువని నీ నోటితో ఒప్పుకొని, దేవుడు మృతులలోనుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షించబడుదువు" (రోమా 10:9) అని లేఖనము తెలుపుతుంది. మరి క్రీస్తుతో పాటు నిశ్చయముగా పరదైసులో ఆ నేరస్థుడు ఎలా ఉండగలిగాడంటే, నమ్మాడు అంటే, " పాపములు క్షమించుటకు భూమి మీద మనుష్యకుమారునికి అధికారము కలదని ....." (మార్కు 2:10) మనం నమ్మితే మన పాపములు తుడిచివేయబడతాయి. మన పాపములు తుడిచివేయబడితేనే మన ప్రభువు మనతో ఉంటారు.

ప్రియ సోదరీ, సోదరుడా దేవుడు నిన్ను జ్ఞాపకం చేసుకోవాలని ఆశపడుతున్నావా అయితే మొదట నీ స్థితిని ఆ పరమాత్మునికి తెలియచేసి నీలోపాన్ని, అవిధేయతను పాపాన్ని ఆయన ఎదుట ఒప్పుకో ఆయన తప్పక జ్ఞాపకం చేసుకుంటారు. రెండవదిగా దేవుని మహిమ పరచు ఆయన నిన్ను జ్ఞాపకం చేసుకుంటారు. మూడవదిగా ఆయన తన రాజ్యముతో మరల రాబోతున్నాడని నమ్మి అడుగుజాడలలో నడువు ఆయన తప్పక జ్ఞాపకం చేసుకుంటారు.

దేవుని రాజ్యమును ప్రేమించువారు అనేకులు కాని ప్రభువు సిలువను మోయువారు కొందరే!



# క్రీస్తు - అనుకరణము

**రచయిత : థామస్ ఎ కెంపిస్**

(గత సంచిక తరువాయి)

5. మనము సామాన్యముగ నొక మనుజుడెంత పని జరిగించినాడో దానిని గూర్చి యడుగుదుము, కాని యెట్టి యుద్దేశమును పురస్కరించుకొని జరిగించెనో దాని గూర్చియంత జాగ్రత్తగా విమర్శించము. అతడు ధైర్యవంతుడేనా, ధనికుడేనా, అందగాడేనా, నేర్పరియేనా, మంచి రచయితయేనా, మధురమైన గాయకుడేనా, పరిశ్రమ చేయువాడేనా, ఓర్పుగల వాడేనా, సాత్వికుడేనా, దైవమునందు భయభక్తులు గల వాడేనాయని సామాన్యముగా నడుగనే యడుగము. ప్రకృతి మానవుని బాహ్య విషయములనే మన్నించును, కాని కృప యాంతరంగికములను వివేచించును, ప్రకృతి సామాన్యముగ నాశాభంగము పొందును గాని, కృప, దేవునియందు నమ్మిక యుంచుటవలన వంచన పొందదు.

***ఆత్మోపేక్ష, దురిచ్ఛా సన్యాసము***

నా కుమారుడా, నిన్ను నీవు సంపూర్ణముగ నుపేక్షించు కొనిననే గాని నీకు సంపూర్ణ స్వాతంత్ర్యము కలుగనేరదు. తమ్ముతాము ప్రేమించు కొనుచు నిత్యము స్వార్థాన్వేషణ చేసికొనువారు శృంఖలాబద్ధులై యున్నారు. వారు అసుయా పరులును ఇతరుల గుట్టులు తెలిసికొనగోరు వారును దేశదిమ్మరులునై యుండి సర్వదా మృదువైన వానిని సున్నితమైన వానిని వెదకుచు యేసు క్రీస్తు విషయంబుల మనస్కరింపక తఱచుగా కుయుక్తితంత్రముల చేత వినశ్వరమైన వాని నిర్మాణించుకొనుచుందురు. దైవము కాని సర్వమును నశించును. సర్వార్థసిద్ధిని కలిగించు యీ సూత్రవాక్యమును మనస్సున నుంచుకొనుము. “సమస్తమును త్యజింపుము. అప్పుడు సమస్తము నీకు దొరకును, ఆశను కోసివేయుము. నీకు శాంతి లభించును” ఈ వాక్యమును నీవు మనస్సున నుంచుకొని దానిని సాధించినచో నీకు సర్వము విదితము కాగలదు.

2. ప్రభూ, ఇదియొక్క దినమున నగుపనికాదు, మఱియునిది పిల్లలాట వంటిదియు కాదు. ఈ చిన్న సూత్ర వాక్యము నందు సర్వపరిపూర్ణత సమసించి యున్నది.

కుమారా, పరిపూర్ణుల పద్ధతి విన్నపుడు దానియెడ విముఖుడవు కాకుము. నిర్వేదము కూడా పొందకుము. కాని యున్నత విషయమును సాధించుటకు నుద్రిక్తచైతన్య వంతుడవు కమ్ము. అట్లు కానిచో కనీసము వానియెడ వాంఛాభిరతుడవై వాని కొఱ కువ్విళ్లూరు చుండుము. నీ యెడల నా కోరిక యేమన, నిన్ను నీవు ప్రేమించుకొనక నాచేతిసైగకు గాని, నీపైని తండ్రిగా నేనెవని నియమించితినో వానిసైగకుగాని నీవు వెంటనే లోబడు

**ప్రసిద్ధులం కావడం కంటే విశ్వసనీయులుగా ఉండడం మరి శ్రేష్ఠం**

వాడవుగానుండవలయును. అప్పుడే నీవు నన్నధికముగా సంతోష పరచువాడవై యుందువు. నీ జీవిత మంతయు సంతోష సమాధానములతో గడచిపోవును.

నీవు విసర్జింప వలసిన వింక నెన్నియోకలవు. నానిమిత్తము నీవు వానిని సంపూర్ణముగా విసర్జింపనిచో నీవాశించు దాని పొందనేరవు.

"నీవు ధనికుడవగునట్లు అగ్నిలోపుటము వేయబడిన బంగారమును నాయొద్ద కొనుమని నీకుపదేశము చేయుచున్నాను" సమస్త నీచవిషయములను తనపాదముల క్రింద త్రొక్కివేయు పారమార్థిక జ్ఞానమే యీ బంగారము. సమస్తమైన ప్రపంచజ్ఞానము కన్నను, సమస్తమైన మానవుల యొక్కయు వ్యక్తులయొక్కయు సంతుష్టికన్నను యీజ్ఞానమును అధికమైన దానిగానెంచి ఉన్నతకక్షయందు దానిని నిలిపి యుంచుము.

3. మానవులు వేనిని ప్రశస్తములుగను విలువైనవిగను ఎంచుదురో వానితో నీచములైన వస్తువులను కొనవలయునని చెప్పితిని, మానవుల దృష్టిలో నిజమైన పారమార్థిక జ్ఞానము నీచమైనదిగను విలువలేనిదిగను కనిపించుచున్నది. ఏలయన నదితన్నుగూర్చి గొప్పగా భావించుకొనక, భూమిపైన తన్నుతాను మహిమపఱచు కొనక పోవుట వలన మానవులమధ్య నది మఱువబడిన దానివలె కనిపించుచున్నది. అనేకులు పెదవులతో మాత్రము దానిని స్తుతింతురు. కాని, తమ జీవితములందు దానికి చాలాదూరమున నున్నారు. కానియది యమూల్యమైన ముత్యమై యనేకుల కన్నులకు గుప్తమైయున్నది.

**హృదయ చాంచల్యము, అంత్యహృదయాభిలాష**

నా కుమారుడా! నీ చిత్తవృత్తిని నమ్ముకొనకుము. అది ఇప్పుడొక దానిపై నిలిచి మఱి కొంతసేపటికి మఱియొక దానిపైకి పోవును నీవు జీవించి యున్నంతకాలము ఇట్టిమార్పులకు లోబడి యున్నవాడవే. ఇట్టి మార్పులు నీ యిచ్ఛకు విరుద్ధములైనవియే కావచ్చును. నీవిపుడు సంతోషముగ నుందువు. మఱు నిముసముననే దు:ఖమున మునుగుదువు. కొంచెముసేపు శాంతుడువుగ నుందువు. ఉత్తరక్షణమున కలత నొందుదువు. ఇప్పుడు భక్తితత్పరత గలిగియుందువు. వెనువెంటనే భక్తిహీనత నీలో జూపట్టును. ఇప్పుడు శ్రద్ధాన్వితుడవుగనుందువు. మరుక్షణమున పరధ్యానమున జొఱబడుదువు. ఒకప్పుడు గంభీరముగ నాలోచింపసాగుదువు. అంతలోనే అల్పభావము కలుగును. జ్ఞానవంతుడై అధ్యాత్మిక విషయములందు శిక్షణ నొందిన వాడు ఈ నిరంతరచిత్త వికారములందు విభ్రమముపొందక నిశ్చలచిత్తమును సమాహితము చేసికొని తన యందు దోచు భావములను లక్ష్యము సేయక, గాలి యెటువీచిన నటు కొట్టుకొని పోవునట్లు ఆలోచనా తరంగముల ననుసరింపక, తన హృదయాభినివేశము నంతటిని ఋజువైనట్టియు నుత్తమోత్తమమైనట్టియునైన గమ్యమునకే యభిముఖముచేయును. ఇట్లాతడనేక పరిస్థితులమధ్య నిర్వికారుడును, నిశ్చలుడును, మార్పులేనివాడునై యుండి తన తదేక దీక్షను నాపై నిలుపును .

-- సశేషం

**ప్రాపంచిక సమస్యలు పరలోకపు సంతోషపు వెలుగులో వెల వెలపోతాయి**



# బైబిల్ ప్రవచనమందు ఇప్పుడు మనం ఏ కాలములో ఉన్నాము

-- రెవ॥ జాన్ రోజ్ గారు

బైబిల్ ప్రవచనము చాలా స్థిరమైనది, ఖచ్చితమైనది. మొదటి వెయ్యేండ్ల కాలము పూర్తికాగానే క్రీస్తు ఈ భూలోకానికి తిరిగి వస్తాడని అనేకుల ఆలోచన ఆ విధంగా బోధించడం కూడ జరిగినది. కాని వాక్యానుసారముగా ప్రవచనము అనేక కోణాలను పరిశీలింప చేయనిదిగా చూడగలం. దానియేలు గ్రంథంలో వ్రాయబడిన చివరి దినాలను పరిశీలిస్తే వాటియొక్క ప్రస్తావన నేటి దినాలకు వర్తిస్తుంది. కాని దానియేలు దినములకు వర్తించవు. లూకా 19:11 వ్రాయబడిన విధంగా పాలస్తీనా ప్రజల యొక్క తలంపు ఏమిటంటే, క్రీస్తు యొక్క పరిచర్య చివరి దినాలలో దేవుని రాజ్యము వెంటనే ప్రత్యక్షపరచబడుతుంది అయితే వారి ఆలోచన సరిఅయినది కాదు అని ఒక ఉపమానము ద్వారా వారి తలంపులను క్రీస్తు ప్రభువు సరి చేశాడు. 2 థెస్స 2:2లో క్రీస్తు రాకడ సమీపముగా ఉన్నదని థెస్సలోనిక విశ్వాసులు నమ్మారు. అయితే పౌలు యొద్దనుండి వారికి వచ్చిన పత్రిక వారి మనస్సులను కలవర పరచినట్లుగా చూడగలం. ఇప్పుడు కూడ అనేక మంది క్రైస్తవ విశ్వాసులు వారి మనస్సులో అయోమయమైన పరిస్థితిని ఎదుర్కొంటూ దేవుని ప్రణాళికలో, ఉద్దేశంలో మన స్థలం ఎక్కడ అని, ఏకాలంలో ఇప్పుడు మనం ఉన్నాము అనే గందరగోళ పరిస్థితిని, ప్రశ్నను కలిగియున్నారు. కాబట్టి దేవుని వాక్యపు వెలుగులో ఈ ప్రశ్నకు జవాబును అన్వేషిద్దాం! ఈ ప్రశ్నకు జవాబుగా రెండు అతి ప్రాముఖ్యమైన విషయాలను మనం పరిశీలన చేద్దాం!

### 1. మనము లేని కాలము

**ఎ. మనము ఇప్పుడు యాకోబు శ్రమలకాలములో లేము:** విశ్వాసులమైన మనము ఇప్పుడు యాకోబు శ్రమలకాలము(మహాశ్రమల కాలం)లో ఉన్నామా? అను ప్రశ్నకు జవాబు 'లేదు' అని చెప్పాలి. 1930 నుండి 45 మధ్య కాలంలో సుమారు 6 లక్షల మంది యూదులు ఐరోపాలో చంపబడ్డారు. ఆవిధంగా యూదులు చంపబడ్డారు కాబట్టి కొందరు అది యాకోబు శ్రమల కాలమని పరిగణించడం జరిగింది. యిర్మీయా 30:7లో అయ్యో ఎంత భయంకరమైన దినము అట్టి దినము మరియొకటిరాదు అని ఆ దినములు యాకోబు సంతతివారికి ఆపద తెచ్చు దినము, అయినను వారు దానిలో పడకుండగా రక్షించబడుదురు యూదా ప్రజలకి రాబోవు గొప్ప శ్రమల కాలము భవిష్యత్‌లో సంభవించునని గమనించగలము. యిర్మీయా 30:7 లో చెప్పబడిన ఈ యాకోబు శ్రమల కాలములో వారు తమ దేవుడైన యెహోవాను సేవించుదురు. 1 థెస్స 4:16,17లో గమనిస్తే యాకోబు శ్రమలు క్రీస్తు ప్రభువు రాకడ సమయంతో ముడిపడియున్నవి కాబట్టి యాకోబు శ్రమలు దాని 12:1లో చెప్పబడిన సమయము అని గమనించగలం, అది భవిష్యత్ కాలము, ఇప్పుడు మనం ఆ సమయమునందు లేము. దాని 12:1లో చెప్పబడిన సంగతులను

ప్రక12వ అధ్యాయంలోని సంగతులతో ఐక్యపరచి చూడాలి. ఒలీవల కొండ మీద ప్రభువు ద్వారా ప్రస్తావించబడిన సమయము భవిష్యత్‌లో యాకోబుకు అనగా ఇశ్రాయేలీయులకు సంభవించు శ్రమల కాలం మత్తయి 24:21. కాబట్టి ఏకాలమందు ఇప్పుడు మనము ఉన్నామో? అన్న మన ప్రశ్నకు యాకోబు శ్రమల కాలమందు కాదు. యాకోబు శ్రమల కాలమును మనము ఇంకను దాటిపోలేదు.

**బి. మనము ఇప్పుడు హర్మెగెద్దోను యుద్ధ కాలమందు లేము :** బైబిల్‌నందు చెప్పబడిన హర్మెగెద్దోను యుద్ధకాలం కాదు ఈ కాలము లేదా హర్మెగెద్దోను యుద్ధకాలము నుండి మనము సాగుటలేదు ఆయుద్ధమునకు సమీపంగా కూడా మనము లేము. హర్మెగెద్దోన్ ప్రకటన 16:16నందు ప్రస్తావించబడింది ఇది మధ్యపాలస్తీనలోని ఒక పర్వత శ్రేణి జిల్లా. నజరేతు నుండి యెజ్రాలియాన్ అను ప్రాంతము హర్మెగెద్దోన్‌ను వేరుచేయుచున్నది. హర్మెగెద్దోన్ అనగా మరణ పర్వతమని ఫాజెట్ అనే వ్యక్తి సంబోధించాడు. " సైన్యముల ప్రాంతము" అని గెసెనియస్ సంబోధించాడు. స్ట్రాంగ్ అభిప్రాయం ప్రకారం హర్మెగెద్దోన్ అనగా సభాప్రాంతం. ప్రకటన 16:14,16ను గమనిస్తే ఈ ప్రాంతములో దెయ్యముల శక్తిని అనుమతించినట్లుగా చూడగలం. హర్మెగెద్దోన్ అను పేరు హెబ్రీ భాషలో వాడబడిన పదానికి అర్థం " లోకమంతట ఉన్న రాజులను పోగు చేయుట" (ప్రకటన 16:14). భూమిపై ప్రభువు తాను స్థాపించు రాజ్యమునకు ముందు ఈ పోగు చేసే కార్యక్రమం జరుగుతుంది. ఇది ఇంకా సంభవించలేదు ఇది భవిష్యత్‌నందు సంభవించవలసినదై యున్నందున మనము హర్మెగెద్దోన్ కాలంలో లేము.

**సి. ఇప్పుడు మనము క్రీస్తు విరోధికాలమందు లేము:** కొన్ని పత్రికలలోను మరియు టి.వి చానల్స్‌లోను ప్రపంచంలోని కొంతమంది ఉన్మాదులను క్రీస్తు విరోధిగా పరిగణించడం జరిగింది, జరుగుతుంది. ఉదాహరణకు కొంతమంది జర్మనీ దేశస్తుడైన హడాల్ఫ్ హిట్లర్ ను క్రీస్తు విరోధి అన్నారు. మరి కొంతమంది ఇటలీ దేశస్తుడైన ముసోలీని అంత్యక్రీస్తుగా పరిగణించడం జరిగింది. కాని దాని 7:8,24లో వ్రాయబడినట్లు 10 కొమ్ములు (10 రాజ్యములు) బయలు పరచబడితేనే కాని క్రీస్తు విరోధి ప్రత్యక్షపరచబడడు.

క్రింది వచనాలలో గమనిస్తే క్రీస్తు విరోధి పనులను చూడగలం దానియేలు గ్రంథంలో చెప్పబడిన క్రీస్తు విరోధిపనులు ప్రకటన 13:5లో ఏకీభవించినట్లు చూడగలం. కాబట్టి దాని 7:8,24లో ప్రస్థావించబడిన మృగము ప్రకటన 13:4,5 లోని మృగము ఒక్కటే. నిజమైన క్రీస్తు తన భూనివాసులలో తన సొంత ప్రజల నిమిత్తమై రానంత వరకు క్రీస్తు విరోధి కాలము సంభవించదు. 1 థెస్స 4:16,17 క్రీస్తు రాకడ, యొక్క ప్రస్థావన 2 థెస్స 2:8లో చెప్పబడిన విషయంకు సరిపోదు. పౌలు ప్రస్థావించిన 'దినము' 1 థెస్స 4:13-18లో చెప్పబడిన సంఘం కొరకు క్రీస్తు రాకడ దినమును ఐక్యపరచకూడదు, కారణం క్రీస్తు విరోధి అనువాడు ప్రస్తుతం ప్రపంచ నాయకులరూపంలో లేడు ఇప్పుడు ప్రపంచంలో లేడు వాడు భవిష్యత్‌లో బయలు పరచబడువాడు.

**డి. యూదులు వారి స్వస్థలమైన వాగ్ధాన భూమి అయిన పాలస్తీన దేశమునకు పరిపూర్ణతలో తిరిగి వచ్చే సమయంలో లేము.**

మే 14, 1948 సం॥లో దేవుడు తన బలమైన హస్తంతో రెండవసారి ఇశ్రాయేలీయులను సమైక్యపరచాడు. ఇది కేవలం ఇశ్రాయేలు యొక్క స్వతంత్రము తెలియజేయు చున్నదే తప్ప, పూర్తి స్థాయిలో వాగ్ధానం చేయబడిన నెరవేర్పు కాదు. యెష 11:11 లో యూదులు వారి

స్వస్థలమైన వాగ్దాన భూమిని తిరిగి పొందుకొనుట అనునది, మెస్సీయా తన రాజ్యమును భూలోకమంతట స్థాపించుటతో ముడిపడి యున్నది. యెష 11వ అధ్యాయం అంతా మెస్సీయా తన రాజ్యమును స్థాపించి ఆ రాజ్యములోని కార్యక్రమమును వివరించుచున్నది. జరగబోయే కార్యక్రమమంతా "ఆ దినము "నకు సంబంధించినది, లోకము యెహోవాను గూర్చిన జ్ఞానంతో నిండియుండును యెష 11:9. ఆ దినము దావీదు వేరు చిగురించును ప్రక 22:16, ఆ దినము ప్రజలకు ధ్వజముగా నిలుచు వేరు యెష 11:10. కాబట్టి యూదులు వారి స్వస్థలమైన వాగ్దానభూమి అయిన పాలస్తీనాను పూర్తి స్థాయిలో ఆక్రమించు కోలేదు. ఆదినము వచ్చేంతవరకు ప్రభు యేసును మెస్సీయగా అంగీకరించే వరకు ఆ దినమురాదు. ప్రభుయేసుని ఇశ్రాయేలీయుల సమాజం మెస్సీయాగా అంగీకరించనంత వరకు యెష 11 అధ్యా మరియు 14:1,2 వచనాల్లో చెప్పబడిన విధముగా వారు వాగ్దానభూమిని స్వతంత్రించు కొనలేరు. కొంతమంది హెబ్రీయులు పాలస్తీన దేశమునకు తిరిగి రావటాన్ని యెష 11:11 నెరవేర్పుగా పరిగణిస్తే, కొంతమంది యూదులు తిరిగి రావటాన్ని అధికార పూర్వకమైన దేవుని సమీకరణ అనుకుంటే అలాంటి వారు దయ చేసి యెష 60వ అధ్యాయం జాగ్రత్తగా చదవండి. వాక్యపు వెలుగులో మనం గమనించవలసిన సత్యం ఏమనగా మనము, ఇంకా ఇశ్రాయేలీయులు పొందుకోవలసిన వాగ్దాన, వాక్యాను సారమైన భూమిని పూర్తిగా పొందుకున్న కాలములో లేము ఈ నెరవేర్పు భవిష్యత్ కాలంలో జరగవలసిఉంది.

-- సశేషం



## బైబిల్ లో ప్రభువుకు సంబంధం గల అంకెలు (1-10)

**1. మీ యెదుట నున్న గ్రామమునకు వెళ్ళగానే కట్టబడిఉన్న ఒక గాడిదయు, దానితో నున్న ఒక గాడిద పిల్లయు మీకు కనబడును. వాటిని విప్పి నా యొద్దకు తోలుకొని రండి అని ప్రభువు శిష్యులకు చెప్పెను. (మత్తయి 21:1)**

**2. ఒక బీద విధవరాలు రెండు కాసులు కానుక పెట్టిలో వేయుచుండగా ప్రభువు చూచి ఈ బీద విధవరాలు అందరికంటె ఎక్కువ వేసెను అని చెప్పెను. (లూకా 21: 2,3)**

**3. మూడు గంటలకు యేసు 'ఏలీఏలీ లామా సబక్తానీ' అని బిగ్గరగా కేక వేసెను. (మార్కు 15:33)**

**4. రాత్రి నాలుగవ జాము ప్రభువు సముద్రము మీద నడుచుచూ శిష్యుల యొద్దకు వచ్చెను. (మార్కు 6:48)**

**5. యేసు ఐదు రొట్టెలు రెండు చేపలు ఐదు వేల మందికి పంచిపెట్టెను. (మార్కు 6:41-44)**

**6. కానా వివాహములో ప్రభువు ఆరు రాతి బానలలోని నీళ్ళను ద్రాక్షరసముగా మార్చెను. (యోహాను 2:6-9)**

**7. ప్రభువు సిలువపై ఏడు మాటలు పలికెను.**

**8. ప్రభువుకు ఎనిమిదవ దినమున సున్నతి చేయించిరి. (లూకా 2:21)**

**9. ప్రభువును సిలువ వేసినప్పుడు పగలు తొమ్మిది గంటలాయెను. (మార్కు 15:25)**

**10. ప్రభువు తన ఉపమానములో పరలోక రాజ్యము, తమ దివిటీలు పట్టుకొని పెండ్లికుమారుని ఎదుర్కొన బయలు దేరిన పది మంది కన్యకలను పోలియున్నది అని చెప్పెను. (మత్తయి 25:1)**

**శ్రీమతి. ఆలూరి. నిర్మలాదేవి, ఒంగోలు.**

నీ దేవుని గొప్పతనాన్ని ధ్యానించు, నీ గొప్ప సమస్యలు చిన్నవిగా కనిపిస్తాయి



# పవిత్ర గ్రంథ పఠన

**THE BIBLE BOOK BY BOOK**

*( An Introduction to the Bible Synthesis )*

( గత సంచిక తరువాయి)

## హోషేయ

*9వ అధ్యా - ఇశ్రాయేలీయులు దేవుని మాటను పెడచెవిని బెట్టి వారిష్టమొచ్చినట్లు ప్రవర్తించుట వలన వారు దేశ దిమ్మరులై అన్యులమధ్య సంచరించెదరని దేవుడు తెలియజేసెను.*

*10వ అధ్యా - వారి రాజును తొలగించివేసెదనని దేవుడు సెలవిచ్చెను. ఈమాట 30 సంవత్సరాల తరువాత నెరవేర్చబడింది.*

*11వ అధ్యా- ఇశ్రాయేలీయులు యెహోవా దేవుని యందు విశ్వాసముంచవలసిన తమ స్వధర్మమును త్యజించి వారిష్టమొచ్చినట్లు తిరుగుచున్నప్పటికీ దేవుడు వారి పట్ల చూపిస్తున్న ప్రేమ ఈ అధ్యాయంలో వ్యక్తపరచబడింది.*

*12వ అధ్యా- వారి రక్తాపరాధము వారి తలలమీదకు వస్తుందని తెలియజేసెను.*

*13వ అధ్యా- ఇశ్రాయేలీయుల పాపము అంచెలంచెలుగా ప్రబలుటవలన వారు దిన దినము దిగజారిపోయారు.*

*14వ అధ్యా- దేవుడు ఇశ్రాయేలీయులకు శిక్షవిధించిన తరువాత భవిష్యత్తులో వారు పొందుకోబోయే ఆశీర్వాదములు ఈ అధ్యాయంలో తెలుపబడినవి.*

## యోవేలు

***గ్రంథకర్త :-*** *పెతూయేలు కుమారుడైన యోవేలు (1:1) పెతూయేలు అనగా "యెహోవాయే దేవుడు" అని అర్థం. అపొస్తలుల కార్యములు 2:16 తప్ప బైబిల్‌లో మరెక్కడాకూడా యోవేలు ప్రవక్తను గూర్చి ప్రస్తావించలేదు. కాబట్టి ఈ గ్రంథంలో మాత్రమే యోవేలు ప్రవక్తను గూర్చి కొద్దిగా ఎక్కువగా తెలుసుకోగలము.*

***గ్రహీతలు :-*** *యూదా ప్రాంతములో కాపురముంటున్న ప్రజలందరకు తెలుపబడిన సందేశము అని చెప్పవచ్చు (యోవేలు 1:1; 3:1,17) ప్రత్యేకంగా చెప్పాలంటే పెద్దలకు (1:2), ద్రాక్షతోట కాపరులు మరియు పైరును సేద్యపరచువారికి (1:11) మరియు యాజకులకు తెలుపబడెను (1:13).*

**కాలము :-** *క్రీ.పూ 838-756 కాలంలో జరిగిన సంఘటనలు తెలుపబడ్డాయి, తూరు, సీదోను, ఫిలిష్తీయులు మరియు ఐగుప్తు వారు ఇశ్రాయేలీయులకు శత్రువులుగా ఉన్న కాలంలో ఈ పుస్తకము రచించబడినట్లుగా తెలుపబడింది.*

***ఈ పుస్తకము యొక్క ముఖ్య ఉద్దేశము :-*** *యూదా ప్రాంతములో కాపురముంటున్న దేవుని ప్రజల భూభాగము గొంగళి పురుగులు, మిడుతలు మరియు పసరుపురుగులతో నిండి వారిపైరులను తిని వేసెను అని మొదటి అధ్యాయంలో తెలుపబడింది. దేవుని తీర్పు ఆవిధంగా వారి మీదకు వచ్చిందని చెప్పవచ్చు. కాబట్టి ప్రజలందరు వారి వంకరమార్గములను విడచి*

**క్రీస్తు అడుగులలో అడుగులు వేసి నడిస్తే నీ అడుగులు తడబడవు**

పాపపు కార్యములను మానుకొని దేవుని వైపు తిరగ వలసిందిగా వారికి పిలుపివ్వబడింది. ఈ మిడుతలను గూర్చి దేవుడు వారి మీదకు పంపు కార్యమనేది "యెహోవాదినము"ను ముందుగా తెలియజేయుట అంతేకాక ఆత్మ సంబంధమైన ప్రాముఖ్యతను గూడా సంతరించుకుంది. ఎప్పుడైతే అన్యజనులు తీర్పు తీర్చబడతారో అప్పుడు ఇశ్రాయేలీయులు ఆశీర్వదించబడతారని రెండవ అధ్యాయము ఆరంభము నుండి జాగ్రత్తగా పరిశీలించి చూసినట్లైతే అక్షరార్ధమైన మిడుతల ద్వారా వచ్చే నాశనమును గూర్చిన ప్రస్తావన ఆగిపోయి, "యెహోవా దినమును" గూర్చిన ప్రస్తావన ఎక్కువగా కనపడటం మనం చూడగలము.

***ఈ పుస్తకము యొక్క ముఖ్యాంశము :-*** *ప్రాముఖ్యంగా చెప్పాలంటే "యెహోవా దినమును" గూర్చిన విషయము ప్రస్తావించబడినది. దానినే కొరింథీయుల పత్రికలో "మనుష్యదినము"(1 కొరింథీ 4:3) అని అక్షరార్ధంగా తెలుపబడింది. ఒకానొక దినాన ప్రభువు దినము రాబోతుంది అనగా ఏదో 24 గంటలు కలిపితే మనమనుకొనే దినము కాదది. ప్రభువైన క్రీస్తు రెండవ రాకడ దినము.*

***ముఖ్యమైన లేఖన భాగములు :-*** *యోవేలు 2:28-32 ముఖ్యమైన పదాలు: "యెహోవాదినము" - 5 పర్యాయాలు వాడబడింది.*

### ***సంక్షిప్త విశ్లేషణ***

*1వ అధ్యాయము - మిడుతలు, గొంగళిపురుగులు మరియు పసరపురుగులు ద్వారా వచ్చే నాశనమును గూర్చి 1 నుండి 12 వచనాలలో విశదపరచబడింది.*

*- పశ్చాత్తాపము గల హృదయముతో, ప్రజలు ప్రభువును వేడుకొనుమని 13 మరియు 14 వచనాలలో తెలుపబడింది.*

*- ఈ గొంగళి పురుగులు, మిడుతలు మరియు పసరపురుగుల ద్వారా వారిపంటలు ఏవిధంగా నాశనమై పోయాయో అదే విధంగా "యెహోవా దినము" ఇంకా భయంకరముగా ఉంటుందని తెలుపటానికి దేవుడు ముందుగా ఈ చీడపురుగుల ద్వారా ఒక పాఠము వారికి తెలియజేయాలనుకున్న విషయము 15 నుండి 20 వచనాలలో తెలుపబడింది.*

*2వ అధ్యా - ఇశ్రాయేలీయుల దేశమునకు ఉత్తర భాగమున ఉన్న శత్రువులు వారి మీదకు దండెత్తి రావడానికి సిద్ధముగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న దేవుని ప్రజలు భయముతో నిండుకొని యుండుట 1 నుండి 10 వచనాలలో విశదపరచబడింది.*

*- యెహోవా సైన్యము బహు గొప్పది అంతేకాక ప్రభువు ఆజ్ఞకోసం ఎదురు చూస్తూ సిద్ధంగా ఉన్నదని 11వ వచనంలో తెలుపబడింది.*

*- ఆ దినమున ప్రజలు పశ్చాత్తాప హృదయమును కలిగియుండటాన్ని గూర్చి 12 నుండి 17 వచనాలలో తెలుపబడింది.*

*- పశ్చాత్తాప హృదయముతో ప్రభువును ఆ శ్రయించిన తన ప్రజలను యెహోవా విడిపించి వారిని ఆశీర్వదించటాన్ని గూర్చి 18 నుండి 27 వచనాలలో తెలుపబడింది.*

*- దేవుడు తన ఆత్మను సర్వజనుల మీదను కుమ్మరిస్తానన్న వాగ్దానము 28 నుండి 32 వచనాలలో తెలుపబడింది. అయితే ఆ వాగ్దానము పెంతికోస్తు దినమున కొద్దిగా నెరవేర్చబడింది మరియు ఈ ప్రస్తుత కాలంలో నెరవేర్చబడుతూ ఉంది కానీ క్రీస్తు రెండవ రాకడ సమయమున పరిపూర్ణంగా నెరవేర్చబడుతుంది.*

-- సశేషం

**దేవుని ప్రేమ నీకు రక్షణ అనుగ్రహిస్తే, ఆయన స్నేహం నిన్ను మరో మెట్టు పైకి నడిపిస్తుంది**



# విధేయత

-- సంకూరి అనిల్ బాబు

ప్రతి విశ్వాసి దేవునికి స్నేహితులుగా, దేవునికి బిడ్డలుగా మారి అనునిత్యము దేవునితో సహవాసము చేస్తూ ఈ లోక సంబంధమైన క్రియలకు స్వస్తి చెప్పిదైవికమైన కార్యాలతో తమ జీవితాలు కొనసాగించాలని ఆశిస్తున్నాను. యేసు మనతో పలికే ప్రతి మాటను ఖచ్చితంగా నమ్మాలనేది నా అభిప్రాయం ఏ మాత్రం సంకోచించరాదు అసలు సందేహం అవసరంలేదు ఆయన ఏది చెపితే మనం అది చేయాలి. అలా చేయడం ద్వారా ప్రతి మనిషి దీవెన పొందుకుంటాడు తద్వారా సమాజం వర్ధిల్లుతుంది.

ఒక దైవ జనుడు దేవుని యందు బలమైన విశ్వాసం కలవాడు చదువు లేకపోయినా తన ప్రార్థన ద్వారా ప్రభువు అద్భుతాలు చేస్తున్నారు. ఆయన దగ్గరకు చాలా మంది రోగులు వచ్చి స్వస్థతపొందుతున్నారు. ఒక వ్యక్తికి రెండుకాళ్ళు మోకాళ్ళక్రింది భాగము లేదు ఆ వ్యక్తి కొరకు ప్రార్థించి నీవు వెళ్ళి ఒక జత చెప్పులు కొని తెచ్చుకోమని ఆయన చెప్పారట. కాళ్ళులేని వ్యక్తి ఉదయమే చెప్పుల షాపుకు వెళ్ళాడు తన కర్రసాయంతో. ఆ షాపుకు మొదటి కష్టమర్ ఈయనే. ఏమిటి బాబు అని అడిగితే చెప్పులు కావాలన్నాడట ఎవరికి అంటే నాకే అన్నాడట వారు ఆశ్చర్యపోయి నీకే అయితే ఏ నెంబరు కావాలని అడిగారట కొంచెం ఆలోచించి 9వ నెంబరు కావాలని చెప్పాడట వారిచ్చారు. అతను దాని వెల చెల్లించి చెప్పుల సంచి భుజాన వేసుకొని ప్రార్థించిన దైవజనుని దగ్గరకు వెళ్ళి అయ్యా చెప్పులు కొని తెచ్చానండీ అన్నాడట. ఏవీ చెప్పులు అంటే భుజాన చూపాడట భుజాన తగిలించావేమిటి తీసి తొడుగు అని పాస్టర్ గారన్నారట వెంటనే సంచిలో నుండి చెప్పులు క్రింద పడేసి తొడగ ప్రయత్నించగా పటపటమనే శబ్దంతో నరములు ఎముకలు సాగి పాదాలు ఏర్పడినాయి. అపుడావ్యక్తి చెప్పులు తొడగగా 9వ నెం॥ చక్కగా సరిపోయాయి. దేవుని బిడ్డలారా ఆ దైవసేవకునికి, ఆరోగికి ఉన్న బలమైన విశ్వాసం, విధేయత మనకుంటే గొప్ప కార్యాలు మనం చూస్తాం అనేకులకు దీవెనకరంగా నిలుస్తాం.

లూకా 6:10 యేసు ఒక ఊచ చెయ్యి గలవానితో చెయ్యి చాపమని పలుకగా అతడు చాపాడు అతని చెయ్యి బాగుపడింది. అనేక పర్యాయాలు యేసు విశ్వాసమును గూర్చి బోధించారు. చచ్చుబడిన చెయ్యి ఏ మాత్రము రక్త ప్రసరణలేని చెయ్యి జీవములేని చెయ్యి యేసు మాటయందు విశ్వాసముంచి చాప ప్రయత్నించగా స్వస్థతను పొందుకొన్నాడు. ఇలాటి సందర్భాలు బైబిల్‌లో అనేకములున్నాయి. అయితే యేసుమాటపై నమ్మకముంచి ఆశీర్వదించబడిన వారున్నారు విని నమ్మక, విధేయత చూపక దానిని కోల్పోయిన వారు కలరు గనుక వారిని మనం గమనిద్దాం.

**విధేయత :** సిరియా దేశానికి ఒక సైన్యాధిపతి ఉన్నాడు అతడు మహాపరాక్రమశాలి

**దేవుని పని చేయాలంటే ఆయనను మన ద్వారా పని చేయనివ్వాలి**

*అతడు యెహోవాను ఎరుగకున్నను యెహోవాయే అతనికి జయమునిస్తున్నారు. తన విజయమును బట్టి తన గౌరవం ఇనుమడిస్తుంది. రాజు, సిరియా సైన్యం, దేశం, తన కుటుంబం తనపై అమితమైన గౌరవం కలిగియున్నాయి కాని తనను తాను ద్వేషించుకొంటున్నాడు. కారణం అతడు కుష్టరోగి. ఇశ్రాయేలు దేశమునుండి చెరగా తేబడిన చిన్నది సైన్యాధిపతి అయిన నయమాను భార్యకు పరిచారముచేస్తుంది. ఆ చిన్నది షోమ్రోనులో ప్రవక్త ఉన్నాడు ఆయన దగ్గరకు వేళ్తే నా యాజమానుడు బాగుపడతాడని చెప్పగా నయమాను కొంతమంది పరివారంతో కొన్నిబహుమతులతో ప్రవక్త దగ్గరకు వెళ్ళాడు. ఎలీషా ఒక పని వానిని పంపి నయమాను యోర్దాను నదిలో 7 మార్లు మునిగిన ఎడల బాగుపడతావని చెప్పించాడు. నయమాను ఆలోచనకు (2 రాజులు 5:11) భిన్నంగా జరిగిన సంఘటనకు కోపోద్రిక్తుడై దమస్కులోని అబానాయును, ఫర్పరు నదులు పవిత్రనదులు కదా నేనువాటిలో దిగి శుద్ధుడనుకాలేనా అని యోర్ధానులో మునుగుటకిష్టపడలేదు. అపుడు(13) అతని దాసులలో ఒకడు చెప్పిన మాటలకు బుద్ధి తెచ్చుకొని యోర్ధానులో 7 మారులు మునిగి నయామాను శుద్ధుడయ్యాడు.*

*ప్రియులారా ఈ వృత్తాంతంలో యోర్ధానులో స్వస్థత ఉందా దేవుని మాట యందు విశ్వాసముంచుటలో స్వస్థత ఉందా ఆలోచించండి. యోర్ధానులో స్వస్థత ఉంటే ఎన్నిసార్లు మునగాలి? ఒకసారి మునిగితే చాలదా! యోర్ధానులో లేదు స్వస్థత దేవుని మాటలో ఉంది విధేయత చూపుటలో ఉంది ఇంకా ఎవరు మనకు బుద్ధి చెప్పాలి ఏ సేవకుడు వచ్చి మనలోపాన్ని గద్దించాలి ఇప్పటికైనా దేవుని మాటపై పరిపూర్ణ విశ్వాసంతో విధేయులమై గొప్పకార్యాలు అనుభవిద్దాం.*

***అవిధేయత :*** *సిరియా సైన్యము షోమ్రోను చుట్టూ ముట్టడివేయగా షోమ్రోను ప్రజలు ప్రాణాలు కాపాడు కొనుటకు పట్టణములోపలే ఉన్న ఆహారాన్ని భుజిస్తూ కాలంగడిపారు ఆహారము అయిపోయింది కరువు ప్రారంభమైంది. గాడిదతల, పావురపు రెట్ట (2 రాజులు 6:25) మరియు పసి పిల్లలను, (28,29) ఆహారంగా తీసుకొనే స్థితికి దిగజారారు. ఆ సమయములో (7:11) రేపు ఈ వేళకు ఆహారము సమృద్ధిగా దొరుకుతుందని ప్రభువు చెప్పమన్నారని ఎలీషా చెప్పగా రాజు దగ్గర ఉండే ఒక అధిపతి నమ్మలేదు (7:2).*

*ప్రియులారా దేవుడు నలుగురు (7:3) కుష్టువ్యాధిగల వారి ద్వారా గొప్పకార్యం జరిగించారు ప్రజల ఊహకందని విధంగా 24గం॥లలో ప్రభువు అద్భుతంగా ఆహారాన్ని అందుబాటులోకి తెచ్చాడు. యెహోవా ఆకాశపు కిటికీలు తెరచినను ఆలాగున జరగదని పలికిన అధిపతి దానిని చూశాడు కానీ అనుభవించలేదు మరణమయ్యాడు(7:19,20). దేవుడు ఆకాశము తెరువలేదు అయోగ్యులైన వారిని సాధనాలుగా వాడుకొని తన పరాక్రమమును చూపారు ఆహారాన్ని సమృద్ధిగా షోమ్రోను వారికందించారు. దైవజనమా ఇవి అంత్యదినములు ఇంకనూ విశ్వాసము, విధేయత మన జీవితాలలో లేకుండా ఉంటే మనం అద్భుతాలను చూడలేం ప్రభువుకు దగ్గర కాలేం. ఆది 18:14, మార్కు 10:27 దేవునికి అసాధ్యమైనదేదిలేదు దేవునికి లోబడుదాం విధేయుల మౌదాం నమ్మికతో యేసుకార్యాలు చూస్తూ అనేకులకు యేసును చూపిస్తూ ఆయన బిడ్డలంగా ఆయన రాజ్యంలో ప్రవేశిద్దాం. విధేయత చూపుట, చూపకపోవుట మీ ఇష్టం. పై కార్యాలలో ఏ స్థానంలో ఉండాలనుకుంటున్నారు విధేయతా? అవిధేయతా? మీరు ఆశీర్వాదాన్ని పొందుకోవాలన్నదే "విలువ" యొక్క ధ్యేయం. దేవుడు మిమ్మును దీవించును గాక*

**ప్రయోజనం లేకుండా ప్రభువు ఎవ్వరినీ పుట్టించలేదు**

from My Dad's Library

సేకరణ :
ప్రవీణ్. సజ్జా

# రాజులు

( గత సంచిక తరువాయి)

**ఇశ్రాయేలు రాజులు (ఉత్తర సామ్రాజ్యము)**

11. యెహోయాహాజు - ఇశ్రాయేలీయులను 15 సంవత్సరములు ఏలిన ఇతడు యెహూ కుమారుడు. దాదాపుగా ఇతని సైన్యమంతటిని సిరియా రాజు నాశనము చేసెను. 2 రాజులు 13:1 - 9

12. యెహోయాషు - యెహోయాహాజు కుమారుడైన ఇతడు యూదా సామ్రాజ్యమునకు వ్యతిరేకముగా యుద్ధమందు విజయము సాధించెను. మరియు ఇతడు ప్రవక్తయైన ఎలీషా మరణకరమైన రోగము చేత పీడితుడైయుండి మంచము పట్టగా అతని దర్శించెను. 2 రాజులు 13: 10- 14:16.

13. రెండవ యరొబాము - యెహోయాషు కుమారుడైన ఇతడు ప్రవక్తయైన యోనా జీవించిన కాలములో ఇశ్రాయేలు సామ్రాజ్యమును పరిపాలించెను. 2 రాజులు 14: 23-29

14. జెకర్యా - యెరొబాము కుమారుడైన ఇతడు యెహూ సంతతిలో చివరివాడు. ఇతనిని యాబేషు కుమారుడైన షల్లూము చంపివేసెను. 2 రాజులు 14:19-15:12.

15. షల్లూము - ఇశ్రాయేలీయులను ఒక్క నెల మాత్రమే పరిపాలించిన ఇతనిని మెనహేము చంపివేసెను. 2 రాజులు 15:10-15

16. మెనహేము - ఇశ్రాయేలు పది గోత్రములను పరిపాలించిన అతిక్రూరులైన రాజులలో ఇతడు ఒకడు. 2 రాజులు 15:14-22

17. పెకహ్యా - మెనహేము కుమారుడైన ఇతనిని, తన సైన్యాధిపతియైన పెకహు కుట్ర చేసి చంపెను. 2 రాజులు 15:22-26

18. పెకహు - ఏలా కుమారుడైన హోషేయ ఇతనిపై కుట్రచేసి చంపివేసెను. 2 రాజులు 15:27-31

19. హోషేయ - ఇతనికి అష్షూరు రాజైన షల్మనేసెరు సంకెళ్ళు వేయించి బందీ గృహములో ఉంచెను. 2 రాజులు 15:30-17:6.

**యూదా రాజులు (దక్షిణ సామ్రాజ్యము)**

1. రెహబాము - సొలొమోను మహారాజు కుమారుడైన ఇతని బుద్ధిహీనత వలన మరియు అహంభావము వలన గొప్ప యుద్ధము అనివార్యమైనది. 1 రాజులు 11:43 - 12:24, 14:21-31.

2. అబీయాము - రెహబాము కుమారుడైన ఇతడు యుద్ధమందు యరొబాముపై విజయము సాధించుటకు దేవుని సహాయము పొందెను. 1 రాజులు 14:31-15:8

-- సశేషం

**హింసతో మనిషిని సంహరించవచ్చుగానీ సత్యాన్ని సంహరించలేము**




# యాజమాని సంతోషం

ఒక రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉన్న రాజుగారికి చక్కని పాప జన్మించింది. రాకుమార్తంటే రాజు,రాణిగారికి చాలా ఇష్టం. పాప ఏది కావాలంటే అది చేసి పెట్టేవారు. ఒక రోజు రాకుమార్తె నాకు బంగారు కోడి కావాలి అడిగింది. రాజు భటులకు ఆజ్ఞాపించాడు ఆ కోడి ఎక్కడ ఉన్నా తక్షణమే పట్టు కొని రండి అని. భటులు ఎంతో ప్రయాసపడి వెతికారు. మొత్తానికి ఒక భటుడు బంగారు కోడిని సంపాదించి తీసుకువచ్చాడు. రాకుమార్తెకు జంతువులన్నా, పక్షులన్నా చాలా ఇష్టం. తన ఇంటిలో ముందుగానే ఒక జాతి కుక్క(ఆల్‌సేషన్ డాగ్) ఉంది. సహజంగా కుక్కలు, కోళ్ళు కలసి ఉండవు . కాని ఇవి అలా ఉండేవికాదు. కోడి ఎక్కడ ఉంటే కుక్క అక్కడే. కుక్క ఎక్కడ ఉంటే కోడి అక్కడే ఉంటున్నాయి. బంగారు కోడి, కుక్క రెండిటికి మంచి స్నేహం కుదిరింది. ఇవి అలా స్నేహం చేస్తూ ఉండగా రాజ భవనంలోనికి ఒక పిల్లి ప్రవేశించింది. ఆ పిల్లిని దాని అరుపులను విని కుక్క మరియు కోడి కూడా అరుస్తూ ఉండేవి. ఆ పిల్లివిచిత్రంగా చూడ ముచ్చటగా రంగులలో ఉండేది. దానితో రాకుమార్తె ఎక్కువ సేపు గడుపూతూ ఉంది. అది చూచిన కోడి, కుక్క తట్టుకోలేక అరుస్తూ ఉన్నాయి. వాటి అరుపులు విని పిల్లి కూడా భయంకరంగా అరుస్తూ ఉంది. రాణి వాటిని అరవవద్దు అని అనేకసార్లు గద్దించింది. ఎంత గద్దించినా వాటి అరుపులు మానడం లేదు. రాణి గారికి వాటి అరుపులతో తల నొప్పి వచ్చింది. వీటిని ఏమి చేయాలా అని ఆలోచించింది.

ఒక భటుడిని పిలిచి కుక్కను, పిల్లిని ఇచ్చి వాటిని చంపేసి రమ్మంది. వాటిని తీసుకొని వెళ్ళిన తరువాత కోడి వైపు చూసింది. ఇదైనా అనవసరంగా ఇంట్లో ఎందుకు? ఎన్ని రోజులు, నెలలు, సం॥రాలు గడిచిపోయినా ఇది గ్రుడ్లు పెట్టలేదు ఎందుకూ పనికి రానిది మన ఇంట్లో ఎందుకు? అని మరొక భటుడిని పిలిచి దానిని కూడా చంపమనింది. రాకుమార్తె తన తల్లి ఆ మూడింటిని చంపేయిస్తున్నందుకు చాలా దు:ఖించింది. రాకుమార్తె దు:ఖాన్ని చూచిన భటుడు కోడిని చంపకుండా ఆమెకోసం తన ఇంటిలో భద్రపరిచాడు. దానికి మంచి పౌష్ఠిక ఆహారం ఇచ్చేవాడు. అలా కొన్ని రోజులు గడిచిపోయినాయి. భటుడిని కోడిని చంపేమయని ఇస్తే భటుడు దానిని వుంచుకున్నాడు అనే వార్త రాణికి తెలిసింది. కోపంతో మండిపోయింది. భటుడు తన ఇంటినుండి రాగానే అతనిని బంధించింది. ఆ భటుని భార్య రాణి దగ్గర పని చేస్తూ ఉంటుంది. అతని భర్తను బంధించారనే వార్త భార్యకు తెలియక సంతోషంగా రాణి వద్దకు వచ్చింది. తన భర్త జైలులో ఉంటే ఇంత సంతోషంగా వస్తుందేమిటా? అని ఆశ్చర్యపోయారు. ఆమె రాణికి జరిగిన విషయం వివరంగా చెప్పింది. తాను వెదకి పాప కోసం తన జేతుల మీదుగా తెచ్చిన కోడిని చంపలేక అది గ్రుడ్డు పెట్టిన తరువాత మీకే అప్పగిద్దాం అని నా భర్త దానిని దాచాడు అని తన భర్త నమ్మకత్వంను గూర్చి తన భర్త ఏవిధంగా దానిని పెంచాడో, రాణికి వివరంగా చెప్పి ఈ రోజు అది గ్రుడ్డు పెట్టింది. అందుకే నేను సంతేషంగా ఉన్నాను అని చెప్పింది. నా భర్త కంటే ముందుగా నేనే దానిని తీసుకొని రావాలని మీకు ఇవ్వాలని తీసుకువచ్చాను అని చెప్పి గ్రుడ్డు, కోడిని రాణిగారికి అప్పగించింది. రాకుమార్తె దానిని చూడగానే ఎగిరి గంతేసి దానిని, లోపలికి తీసుకుని వెళ్ళిపోయింది. ఇంతకాలం నీరసంగా ఉన్న తన కూతురు ఆనందాన్ని బట్టి రాణీ చాలా సంతోషించింది. రాణి భటుడి నమ్మకత్వాన్ని అర్ధం చేసుకోక బంధించినందుకు బాధపడి అతనిని విడిపించింది. అతనిని భటుడి ఉద్యోగం నుండి సైన్యాధిపతిగా నియమించింది.

పిల్లలు చదివారుగా భటుని నమ్మకత్వం కోడిని బ్రతికించింది. యాజమానికి సంతోషం కలిగించింది.

**ప్రేమించకుండా యివ్వగలము కానీ ఇవ్వకుండా ప్రేమించలేము**

[illegible]ంచబడుతాము.

క్విజ్ విభాగం - 80

- నిత్యానంద కుమార్. సంకూరి

# లేఖన పరిజ్ఞానం

01. " నేనే **మార్గమును,** సత్యమును, జీవమును" అని ఎవరెవరితో అనిరి?

02. " వీరు మీకు రక్షణ **మార్గము** ప్రచురించువారై యున్నారు " అని ఎవరెవరిని గూర్చి పలికిరి ?

03. " **సర్వోత్తమమైన మార్గమును** మీకు చూపుచున్నాను" అని ఎవరెవరితో అనిరి?

04. " వీరిని బట్టి **సత్యమార్గము** దూషింపబడును " 'వీరు' ఎవరు?

05. " నీవెవనియందును మోమాటము లేక సత్యముగానే **దేవుని మార్గమును** బోధించుచున్నావు" అని ఎవరెవరితో అనిరి ?

06. " అతని చేర్చుకొని **దేవుని మార్గము** మరి పూర్తిగా అతనికి విశదపరచిరి" ఎవరు? ఎవరికి?

07. గొఱ్ఱెల దొడ్డిలో ద్వారమున ప్రవేశింపక **వేరొక మార్గమున** ఎక్కువాడు ఏమైయున్నాడు?

08. "వారు మతభేదమని పేరు పెట్టు **ఈ మార్గము** చొప్పున నా పితరుల దేవుని సేవించుచున్నాను" అని ఎవరెవరితో అనిరి ?

09. " తూర్పు నుండి వచ్చు **రాజులకు మార్గము** సిద్ధ పరచబడునట్లు దాని నీళ్ళు ఎండిపోయెను" దేని నీళ్ళు ?

10. "యేసు మన కొరకు **ప్రతిష్ఠించిన మార్గము**" ఏది ?

పైన ఇవ్వబడిన ప్రశ్నలకు సరియైన సమాధానములను వ్రాసి మార్చి 25 లోపు మీ పూర్తి అడ్రసుతో సహా మా కార్యాలయమునకు పంపవలెను.

## లేఖన పరిజ్ఞానము - 79(ఫిబ్రవరి)జవాబులు :

1. పౌలు, సిల్వాను, తిమోతి-థెస్సలొనీకయులు (1థెస్స2:8; 1:1
గలతీ 2:20 ప్రకటన 3:19 1
పేతురు1:8 యాకోబు 1:12 జెఫన్యా 3:17
(యిర్మీయా 31:3 (యెషయా43:4
సామెతలు 27:5 కీర్తన 145:20

## సరియైన సమాధానములు వ్రాసినవారు :

పి.సతీష్(గుడ్లవల్లేరు), పి.బ్యూలా, శాంతవర్ధన్, (దివితాలుకా), సి హెచ్. సుషమ (పామర్రు), డి. ప్రసాద్ (కురుమద్దాలి), ఎ. స్టీఫెన్ (చీపురు పల్లి) యన్. చార్లెట్ (హిందుపూర్), కె. రాజు (మార్కాపూర్) బ్యూలా (కురుమద్దాలి) షార్కిషారోన్ (కుదరవల్లి) హెప్సిబా (గుంటూరు)